జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

సంపుటి 15 సంచిక 266 విశాఖపట్నం | గురువారం 25 మే 2023 | 8 పేజీలు | వెల : 5.00



కావలెను

రాష్ట్ర వ్యాప్తంగా నూతన శకాన్ని లిఖించబోతున్న

పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి

ఆంధ్రప్రదేశ్ 175 నియోజకవర్గాల నుంచి 175 మంది వాలంటీర్స్ ని నియమిస్తుంది.

ప్రతి వాలంటీర్ కు

నెలకు Rs.25,000/-

Salary ఇవ్వబడును.

విద్యా, వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా వాలంటీర్ గా చేరవచ్చు.

ఆసక్తి గలవారు మీ బయోడేటాను ఆధార్ కార్డు తో సహా

మీ ప్రాంతంలో ఉన్న పార్స్ లీడర్స్ ని సంప్రదించవచ్చు.

లేదా ఈ క్రింది నెంబర్

7660027683 కి వాట్సాప్ చేయగలరు.


## పేదరికం రూపు మాపాలంటే...

# చదువు ఒక్కటే మార్గం

### కొవ్వూరులో ముఖ్యమంత్రి జగన్

### విద్యాదీవెన పథకానికి సంబంధించి నిధులు విడుదల

### 9.95 లక్షల మంది విద్యార్థుల తల్లి ఖాతాల్లో నగదు జమ



కొవ్వూరు : సమాజంలో పేదరికాన్ని రూపు మాపాలంటే చదువు ఒక్కటే మార్గమని ఆంధ్రప్రదేశ్ సీఎం వైయస్ జగన్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో విద్యాదీవెన పథకానికి సంబంధించి నిధులను ఆయన విడుదల చేశారు. ఈ మేరకు 2023 మార్చి త్రైమాసికానికి సంబంధించిన 703 కోట్ల రూపాయల నిధులను బటన్ నొక్కి 9.95 లక్షల మంది విద్యార్థుల తల్లి ఖాతాల్లో నగదు జమ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు. భావి తరాల పిల్లల తలరాతలు మార్చేందుకే ఈ విద్యా దివెన ఖర్చు అని, ఇవే మానవ వనరులమీద పెట్టుబడులు అని చెప్పుకొచ్చారు. ఇంకా రానున్న రోజుల్లో దేశానికి దశ, దిశ ఆంధ్రప్రదేశ్ చూపిస్తుందని పేర్కొన్నారు. ఇంకా ఏ రాష్ట్రంలో లేని విధంగా నర్సరీ నుంచి, ఉన్నత విద్యవరకూ విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని అన్నారు.సీఎం జగన్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'మన సమాజంలో పేదరికంలో మగ్గిపోతున్న కుటుంబాలు చాలా ఉన్నాయి. ఆ కుటుంబాల తలరాతలు మారాలి. వారు పేదరికం నుంచి బయటకు రావాలి. ఆ కుటుంబాల నుంచి డాక్టర్లు, ఇంజినీర్లు, కలెక్టర్లు లాంటి వారు తప్పక రావాలి. పేదరికం అనే సంకెళ్లను వారు తెంచుకోవాలి. అయితే దానికి చదువు ఒక్కటే మార్గం. ఒక అంబేద్కర్, ఒక సావిత్రీ పూలే కాని, మౌలానా అబ్దుల్ ఆజాద్ కాని వారి నోట్లోనుంచి వచ్చిన మాట ఏంటంటే.. చదువు అనేది ఒక్క అస్త్రం అని. అలాంటి చదువుల విప్లవం మన రాష్ట్రంలో నాలుగు సంవత్సరాలుగా చేపట్టాం. చదువులు అన్నవి పేదలకు ఒక హక్కుగా అందాలి' అని పేర్కొన్నారు. అలాగే మా ప్రభుత్వం ఉన్నత విద్యలు కొనసాగించాలనుకునేవారికి జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన కార్యక్రమాలను అమలు చేస్తోందని, పూర్తి ఫీజులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ప్రతి త్రైమాసికంలోనూ జమచేస్తున్నామని పేర్కొన్నారు. అయితే చంద్రబాబు ప్రభుత్వంలో అరకొరగా ఫీజులు చెల్లించారని టీడీపీపై ఎద్దేవా చేశారు. చంద్రబాబు రూ. 1777 కోట్ల రూపాయలు బకాయిపెట్టాడని, ఆడబ్బును కూడా మన ప్రభుత్వమే తీర్చిందని, బోర్డింగ్ ఫీజులను కూడా ప్రభుత్వమే చెల్లిస్తోందని, ప్రతి ఏటా వసతి దీవెన కింద రెండు మార్లు తల్లుల ఖాతాల్లోకి జమచేస్తున్నామన్నారు. అలాగే అక్షరాల 25 లక్షల మందికిపైగా విద్యార్థులకు ఈ పథకం వర్తింపు చేస్తున్నామని, కేవలం ఒక్క ఈ పథకానికే రూ.4,275.76 ఖర్చుచేశామని తెలిపారు.

## నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవాన్ని

# బహిష్కరిస్తున్నాం

### 19 ప్రతిపక్ష పార్టీలు



న్యూఢిల్లీ: పార్లమెంట్ నూతన భవనాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల 28న లాంఛనంగా ప్రారంభించనున్న విషయం తెలిసిందే. పార్లమెంట్ భవనాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించడంపై ప్రతిపక్షాలు అభ్యంతరం మధ్య, మే 28న జరగాల్సిన వేడుకను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాయి. ఈ కార్యక్రమానికి హాజరు కావడం లేదని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, తణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఆర్జేడీ, జేడీ(యూ), ఎన్సీపీ, ఎస్పీ, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), కమ్యూనిస్టులు సహా 19 ప్రతిపక్ష పార్టీలు ముక్త కంఠంతో ప్రకటించాయి ఈ మేరకు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. వచ్చే ఏడాది జరగనున్న జాతీయ ఎన్నికలకు ముందు రాజకీయ ప్రకటన చేయడానికి అధ్యక్షుడు ద్రౌపది ముర్ముకు బదులుగా కొత్త పార్లమెంట్‌ను ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రణాళికలను ప్రతిపక్ష పార్టీలు ఖండించాయి. జాతిపిత మహాత్మా గాంధీ నుంచి పూర్తిగా భిన్నమైన అభిప్రాయాలను పంచుకున్న హిందుత్వ సిద్ధాంతకర్త వీడీ సావర్కర్ జయంతి సందర్భంగా ఈవెంట్‌ను షెడ్యూల్ చేయడాన్ని కూడా వారిలో కొందరు విమర్శించారు.

## 'మా బంధాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించం': మోదీ



దిల్లీ: ఆరు రోజుల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న ప్రధాని మోదీ తన పర్యటనను విజయవంతంగా కొనసాగిస్తున్నారు.. ఈ సందర్భంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, మోదీ బుధవారం పలు అంశాలపై చర్చలు జరిపారు. ఈ మధ్యకాలంలో ఆ దేశంలో హిందూ ఆలయాలు, ప్రార్థనా మందిరాలపై జరుగుతోన్న దాడులు వారి మధ్య చర్చకు వచ్చాయి..'ఆస్ట్రేలియాలో ప్రార్థనాస్థలాలపై జరుగుతోన్న దాడులు, వేర్పాటువాద శక్తుల కార్యకలాపాల గురించి అల్బనీస్, నేను గతంలో చర్చించాం. ఇప్పుడు కూడా ఆ అంశం మా మధ్య ప్రస్తావనకు వచ్చింది. ఈ రెండు దేశాల మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాలకు హానికలిగించే చర్యలను మేం ఏ మాత్రం అంగీకరించం. అలాంటి మూకలపై కఠిన చర్యలు తీసుకుంటామని అల్బనీస్ మరోసారి హామీ ఇచ్చారు' అని మోదీ వెల్లడించారు. ఇక ఈ ఇద్దరు నేతలు పునరుత్పాదక ఇంధనం, వాణిజ్యం, రక్షణ రంగాలకు చెందిన పలు అంశాలపై చర్చించారు..

## త్రిపుర రాష్ట్ర టూరిజం అంబాసిడర్‌గా గంగూలీ



త్రిపుర: భారత క్రికెట్ దిగ్గజం, టీం ఇండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కీలక బాధ్యతలు చేపట్టబోతున్నారు. గంగూలీని త్రిపుర టూరిజం అంబాసిడర్ గా నియమిస్తున్నట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గంగూలీని కోల్‌కతాలోని ఆయన నివాసంలో త్రిపుర పర్యాటక శాఖ మంత్రి సుశాంత్ చౌదరి సమావేశమై తమ ప్రభుత్వ నిర్ణయాన్ని తెలియజేశారు. వారి ప్రతిపాదనను గంగూలీ అంగీకరించారు.'త్రిపుర టూరిజం బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండాలనే మా ప్రతిపాదనను భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అంగీకరించడం గర్వించదగ్గ విషయం. ఈ రోజు నేను ఆయనతో టెలిఫోన్‌లో సంభాషించాను. అతని భాగస్వామ్యం ఖచ్చితంగా త్రిపుర రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రోత్సాహాన్ని ఇస్తుందని నేను విశ్వసిస్తున్నాను' అని త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా అన్నారు.కాగా, గంగూలీ వచ్చే నెల ప్రారంభంలో విదేశీ పర్యటకు వెళ్లనున్నారు. పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత జూన్ చివరిలో త్రిపుర రాజధాని అగర్తలాలో పర్యటించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

## ఢిల్లీ ఆర్డినెన్స్‌పై పోరు : పవార్, ఉద్ధవ్ ఠాక్రేలతో కేజ్రీవాల్ భేటీ



న్యూఢిల్లీ : బ్యూరోక్రాట్ల బదిలీలు, పోస్టింగ్‌లపై పట్టు కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ఆప్ చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తన పోరాటాన్ని ఉధృతం చేశారు. ఈ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా విపక్షాల మద్దతును కూడగడుతున్న కేజ్రీవాల్ మంగళవారం కోల్‌కతాలో బెంగాల్ సీఎం, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీతో భేటీ కాగా నేడు ముంబైలో ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్‌తో పాటు శివసేన (యూబిటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేలతో సమావేశం కానున్నారు.కేజ్రీవాల్‌తో పాటు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఇతర ఆప్ నేతలు ఉద్ధవ్ ఠాక్రేతో ఆయన నివాసంలో సంప్రదింపులు జరపనున్నారు. ఇక ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను గుంజుకుంటూ కేంద్రం జారీ చేసిన ఆర్డినెన్స్‌పై పోరును జాతి పోరాటంగా అరవింద్ కేజ్రీవాల్ అభివర్ణించారు. తమ బిల్లులన్నీ రాజ్‌భవన్‌లో మగ్గుతున్నాయని తమిళనాడు సీఎం చెబుతున్నారని, ఇది కేవలం తమ పోరాటమే కాదని ఇది దేశవ్యాప్త పోరాటమని స్పష్టం చేశారు. ఢిల్లీ పోలీసులు మనీష్ సిసోడియాను ఎలా ట్రీట్ చేశారో మీరంతా చూశారని అన్నారు. ఢిల్లీలో బ్యూరోక్రాట్‌ల పోస్టింగ్, బదిలీలపై నియంత్రణ కోసం కేంద్రం జారీ చేసిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా విపక్షాల మద్దతు కూడగట్టేందుకు కేజ్రీవాల్ రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. అధికారుల బదిలీలు, పోస్టింగ్‌ల కోసం కేంద్రం నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీస్ అథారిటీ ఏర్పాటు దిశగా ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆప్ బీజేపీయేతర పార్టీల మద్దతును కోరింది. ఇది విపక్షాలకు అగ్నిపరీక్ష సమయమని దేశ ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడాలనుకునే పార్టీలు ముందుకు రావాలని ఆప్ పిలుపు ఇచ్చింది. ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను కత్తిరిస్తూ కేంద్రం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను టీఎంసీ కూడా వ్యతిరేకించింది. కేంద్రం ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తోందని దుయ్యబట్టింది.


"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేద్కర్

BUSSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?

మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

మాస్టర్ కీ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేద్కర్

జై పూలే | జై భీమ్ | జై బహుజన | జై భారత్

# జగ్గంపేట నియోజవర్గం సర్వసభ్య సమావేశం

**ముఖ్యఅతిథిగా జిల్లా టిడిపి జ్యోతుల నవీన్**




జగ్గంపేట ప్రజాపాలన ప్రతినిధి.కాకినాడ జిల్లా జగ్గంపేట మే 24: స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జగ్గంపేట నియోజకవర్గం సర్వసభ్య సమావేశం రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ కాకినాడలో జరిగిన మినీ మహానాడు విజయవంతం చేశారని అదేవిధంగా ఈనెల 27, 28 తేదీల్లో రాజమండ్రి లో జరిగే మహానాడు2023 విజయవంతం చేయాలని విజయవంతం చేయాలని జ్యోతుల నెహ్రూ విజయం కోసం ప్రతి ఒక్కరు ఇప్పటినుండి కంకణ బద్ధులై పని చేయాలన్నారు. అదేవిధంగా కాకినాడ ఎంపీగా పోటీ చేయడానికి నేను చేసే ప్రయత్నానికి నియోజవర్గ పార్టీ క్యాడర్ అందిస్తున్న తోడ్పాటు మరువలేనిదని అన్నారు. జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రాజమండ్రిలో జరిగే చరిత్రత్మక మహానాడు, యుగపురుషుడు నందమూరి తారక రామారావు గారు శతజయంతి ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో నియోజకవర్గం నుండి 25 వేలు 30 వేల మంది హాజరు అవ్వాలని కోరారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా వంద మినీ మహానాడులు నిర్వహించుకున్నామని అమెరికాలో మహానాడుకి ఆ ప్రభుత్వం ఇచ్చిన అనుమతి చూస్తుంటే ఆ మహనీయుడికి ఏ విధమైన గౌరవం మనందరికీ తెలుసు ఈ మహానాడు తో రేపు రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయానికి బాటలు వేసుకోవాలని చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన చారిత్రాత్మక అవసరం ఈ రాష్ట్రానికి ఉందని నెహ్రు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి లు ఎస్వీఎస్ అప్పలరాజు, కోర్పు లచ్చయ్య దొర, నాలుగు మండలాల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, పోతుల మోహనరావు, చదరం చంటిబాబు, మంగరాతు రామకృష్ణ, కన్నబాబు, అడపా భరత్ బాబు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, ఉంగరాల రాము, జంపన సీతారామచంద్ర వర్మ, ఈది అశోక్, ఉండవల్లి వీర్రాజు, పాండ్రంగి రాంబాబు, మండల మహిళా అధ్యక్షురాలు నకిరెడ్డి సూర్యవతి, నాలుగు మండలాల ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్చార్జులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు .

# మీరు తప్పులు చేసి నాపై నిందలా..?

## పిఎసిఎస్ చైర్మన్ అమజూరి అప్పారావు




భీమిలి ప్రజాపాలన ప్రతినిధి మే 24: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ లో స్థానిక పిఎసిఎస్ చైర్మన్ అమజూరి అప్పారావు పత్రికా సమావేశంలో తనపై వచ్చిన నిరాధారమైన ఆరోపణలపై ఖండించారు. మే 23వ తారీకు మంగళవారం నాడు మండల బిజెపి ప్రధాన కార్యదర్శి మహంతి అప్పల రమణ (శ్రీను) చేసినా ఆరోపణలో ఏమాత్రం వాస్తవం లేదని రైతులందరూ తమ పొలంలోని మల్లల్లోకి కాలువ ద్వారా వచ్చే నీరు సరిగా రావడం లేదని అందరూ ఒక్కటై కాలువ లో ఉండే ఎత్తు పల్లాలను చదును చేసి తమ పొలాలకు నీరందేలా ఏర్పాటు చేసుకోవడానికి జెసిబి పెట్టి కాలువ చదును చేసుకుంటున్నారని, అంతేతప్ప ఈ విషయంలో ఎటువంటి సంబంధం లేని అముజూరి అప్పారావును వ్యక్తిగత కక్షలతో అతను పై దుష్ప్రచారము తగదని రైతులు అందరూ ముక్తకంఠంతో ఖండించడం జరిగింది. ఏదైతే అముజూరి అప్పారావు పై కక్షపూరితమైన ఆరోపణలు చేస్తున్న వ్యక్తి గతంలో విఆర్వోగా చేసత్తా ఎన్నో అవకతవకలకు పాల్పడినారని వారు అన్నారు. మహంతి అప్పల రమణ వీఆర్వోగా చేస్తున్న సమయంలో హుదూద్ తుఫాన్ సమయంలో కొయ్య కొండ సమీపంలో సుమారు 150 మంది రైతులు కు ప్రతి రైతుకు 5000 చొప్పున ఇచ్చిన మొత్తం డబ్బును ఈ వ్యక్తి తినేయడం జరిగిందని, అదే వ్యక్తి అప్పట్లో రైతులకు కంపోస్ట్ ఎరువులు తయారీకి ప్రతి రైతుకు ఒక యూనిట్ కింద కంపోస్ట్ ఎరువులు తయారీకి కుండీలు ఏర్పాటుకు వచ్చిన డబ్బులను స్వాహా చేయడం జరిగిందని, తర్వాత వీఆర్వోగా చేస్తున్న సమయంలోనే తన ఫ్యామిలీ మెంబర్స్ కు ఉపాధి హామీ పనులకి వెళ్లకపోయినా మస్తర్లు వేసి అక్రమార్జనకు పాల్పడ్డాడని అన్నారు. విఆర్వి గా చేస్తున్న సమయంలోనే అప్పటి గవర్నమెంటువారు ఇల్లు నిర్మించుకునే ప్రతి లబ్ధిదారుడి కి డబ్బు వేయగా సుమారు 7000 రూపాయలు చొప్పున వారి దగ్గర నుండి వసూలు చేశాడని, రేషన్ బియ్యం కూడా అక్రమంగా నిల్వచేసి తమ పొలంలో ఉన్న షెడ్డులో నిలువచేసిన విషయాన్ని అధికారులు తెలుసుకొని అతనిపై 6ఏ కేసు పెట్టారని వివరించారు. మహంతి అప్పల రమణ తన పెదనాన్న భూమిని సుమారు ఎకరం 15 సెంట్లను తన పేరుమీద పాస్ బుక్ చేయించుకుని పెదనాన్నకు తెలియగా ఆనందపురం పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇవ్వగా మహంతి అప్పలరమణ కుటుంబ సభ్యులందరూ స్టేషన్లో తప్పు అయిపోయిందని క్షమించమని లిఖితపూర్వకంగా స్టేషన్ వారికి ఇవ్వడం జరిగినది. అప్పల రమణ మండల బిజెపి ప్రధాన కార్యదర్శిగా ఉంటూ సొంత ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తూ పోలీసు వారికి దొరికిపోగా అతను భార్యను జైల్లో ఉంచడం జరిగిందని అన్నారు. తన అక్రమాలు అన్ని బయటికి ఒక్కొక్కటిగా ఎప్పటికప్పుడు బయటపడుతుండటంతో నాపై వ్యక్తిగతంగా కక్ష పెట్టుకుని నా పేరును బధనం చేయడానికి పూనుకొని ఈ విధంగా రైతులను ఇబ్బంది పెడుతున్నాడు .పంట సమయాల్లో అక్రమంగా ఎరువులు క్రిమి సంహారక మందులు అమ్మటం వంటివి ఇప్పటికి చేస్తూ ఉన్నాడని అన్నారు .గ్రామంలో ఉన్న ఏ ఒక్క రైతును అడిగిన ఎవరు ఎలాంటి వారో చెబుతారని అమజూర అప్పారావు అన్నారు .ఈ విషయంపై స్థానిక తాసిల్దార్ కు మరియు స్థానిక పోలీస్ స్టేషన్లో సిఐ వారికి మహంతి అప్పల రమణ పై ఫిర్యాదు చేస్తానని తెలియజేశారు.

# ఎస్సీ ఎస్టి సబ్ ప్లాన్ ను పాలకులు చిత్తశుద్ధితో అమలు చేయాలి



పల్నాడు జిల్లా. నరసరావుపేట .మే 24 ( ప్రజా పాలన ప్రతినిధి): ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలులో పాలకులకు పారదర్శకత అవసరం అని, ఏ ఏ వర్గాలకు ఆర్థిక సోలంబన ప్రణాళికలు సిద్ధం చేసేలాగా చట్టాన్ని బలోపేతం చేసే బాధ్యత ప్రభుత్వానిదే అని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ కన్వీనర్ అల్లడి దేవకుమార్ తెలియజేశారు. బుధవారం పల్నాడు ఎన్ జి ఓ హెూం నరసరావుపేటలో జిల్లా దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కన్వీనర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షతన జరిగిన సమావేశం ఏర్పాటులో దెవకుమార్ మాట్లాడుతూ మూడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో ప్రభుత్వాలు చేపట్టిన పేదరిక నిర్మూల పథకాలు ఊరి చివర ఉన్న షెడ్యూల్ కులాలు ఊరి అవతల ఉన్న షెడ్యూల్ తెగలు కు ఇతర కులాల మధ్య ఉన్న సామాజిక ఆర్థిక అసమానతలను,తొలగించుటలో ప్రభుత్వాలు ఆశించిన స్థాయిలో మార్పు లు తీసుకురాలేకపోయాయని ఆయన అన్నారు. ప్రముఖ న్యాయవాది,పల్నాడు జిల్లా ఎస్ సి,ఎస్ టి మానిటరింగ్ కమిటీ సభ్యులు మల్లెల అశోక్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ పంచవర్ష ప్రణాళికలో అంతర్భాగమే ఈ నిధులను వేరే పనులకు మళ్లించకూడదు, మిగిలించకూడదు తప్పనిసరిగా ఖర్చు చేయాలని ఆయన అన్నారు. ఎమ్ ఆర్ పి ఎస్ అధ్యక్షులు అడపా మోహన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ 2013 లో 10 సంవత్సరాలు కాల పరిమితి తో అమలు చేయడం జరిగినది . 2023 తో ముగుస్తున్న ఈ చట్ట కాలపరిమితిని 10 పొడిగిస్తూ నేటి ప్రభుత్వం నిధులు లేని చట్టాన్ని పేద ప్రజలకి అందించినట్లు చూపటం బూటకం అని ఆయన అన్నారు. జనజాగృతి మండలి అధ్యక్షురాలు పిడతల రమాదేవి, మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్లలో నిధులు లేని తీరు నిరుపేద దళిత గిరిజనులను అగాధములోనికి నెట్టి వేసిన పరిస్థితి దాపురించిందని ఆయన అన్నారు. రేపూడి కుమారి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ పనితీరుతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంఘటిత పరచాలని ఆయన అన్నారు. దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ రమణ మూర్తి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీల పట్ల దుర్మార్గతను సామాజిక దాడులు ఆర్థిక సమాంతలను పెంచి పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఆర్సీ మహిళా నాయకులు మేడే వెంకట రమణ, కోటిరత్నం, వేణు పాల, దళిత గిరిజన నాయకులు ఉద్యోగస్తులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా టిడిపి శ్రేణుల నిరసన

**నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు**



పల్నాడు జిల్లా. నరసరావుపేట. మే 24 (ప్రజా పాలన ప్రతినిధి): నరసరావుపేట టీడీపీ కార్యాలయం వద్ద పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా??చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు నిరసన ప్రదర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని,పరిపాలన చేతకాని జగన్ రెడ్డి దిగిపోవాలంటు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డా??చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ......వైసీపీ నాలుగేళ్ల పాలనలో ఎనిమిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి విద్యుత్ బిల్లులకు సంక్షేమ పథకాలకు లింకు పెట్టి సంక్షేమ పథకాలను సామాన్యులకు అందకుండా కుట్ర పన్నారని డా??చదలవాడ అరవింద బాబు ఆరోపించారు. మూడు స్లాబుల విద్యుత్ రేట్లు పెంచి సామాన్య,మధ్యతరగతి ప్రజల నుంచి జగన్ ప్రభుత్వం 51 వేల కోట్లు దోచుకుందని జగన్ ముఖ్యమంత్రిగా కాకుండా వడ్డీ వ్యాపారిల విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలను పీడిస్తున్నారని డా??చదలవాడ మండిపడ్డారు. 50 వేల కోట్ల విద్యుత్ బకాయిలను పూడ్చుడానికి ప్రభుత్వం సామాన్య ప్రజల మీద భారం మోపడం సరికాదని డా??చదలవాడ ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ తీసుకొచ్చిన కొత్త స్లాబ్ విధానం ప్రతి యూనిట్ కు ఏడు నుంచి ఎనిమిది పెంచే అవకాశం ఉందని పరిపాలన చేతకాకపోతే జగన్ దిగిపోవాలి కానీ సామాన్య ప్రజల మీద పన్నుల భారం మోపటమేంటని డా??చదలవాడ నిలదీశారు. జగన్ పాలనలో ఇంటి అద్దెతో విద్యుత్ బిల్లు పోటీ పడుతూ పెరుగుతున్నాయని ఎద్దేవ చేశారు. సామాన్య ప్రజలకు సంక్షేమం పేరుతో పంచి పన్నుల పేరుతో మూడింతలు వసూలు చేసే జగన్ రెడ్డి ప్రభుత్వానికి పాలించే అర్హత లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక విద్యుత్ బిల్లు,నిత్యవసర వస్తు ధరలు,నీటి పన్ను,చెత్త పన్ను పెంచి ఖర్చులు చూస్తే ఆకాశాన్ని అంటుతున్నాయని,ఆదాయం చూస్తే పాతాళంలోకి తొక్కబడిందని సామాన్యులు జగన్ పాలనలో బ్రతకలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇండ్లమూరి రామారావు,పులిమి రామిరెడ్డి,కొవ్వూరు బాబు,మాబు,చింతిరాల బాలు,కొర్నేపాటి సంజీవ్ రావు,కాకుమాను వెంకట్రావు,వనమా పవన్,మద్దు తిరుపతయ్య,ఖలీల్,మల్లికార్జున్ రావు,అజయ్,ఖాజా,కిషోర్,బంగారం,అగస్టీన్ తదితరులు పాల్గొన్నారు.





జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన

## సంపాదకీయం

గురువారం 25, మే 2023

# బీజేపీని దక్షిణాది ఆదరించదా?

'ప్రధానమంత్రి నరేంద్రమోదీ గ్రాఫ్ పడిపోతోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నాలుగైదు రాష్ట్రాల్లో మినహా బిజెపికి పెద్దగా సీట్లు రావు. తెలంగాణలో అయితే బిజెపి ఇక లేచే అవకాశమే లేదు..' అని బిజెపిలో చేరిన మాజీ ఎంపి ఒకరు అన్నారు. 'కేసిఆర్‌కు, బిజెపి అగ్రనేతలకు అహగాహన ఏర్పడినట్లు అనుమానాలు రేకెత్తుతున్నాయి. అందుకే మద్యం కుంభకోణంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం లేదు' అని మరో మాజీ ఎంపి వ్యాఖ్యానించారు. తెలంగాణలో బిజెపిలో చేరిన ఇతర పార్టీల నేతలలో అంతర్మథనాన్ని 'కర్ణాటక' పురిగొల్పుతున్నట్లు వారి ఆ వ్యాఖ్యలు చెప్పకనే చెప్పుతున్నాయి. నిజానికి కర్ణాటకలో ఓడిపోయిన తర్వాత దక్షిణాదిలో నెగ్గాలంటే తెలంగాణలో విజయం సాధించవలసిన అనివార్య పరిస్థితి బిజెపికి ఏర్పడింది. అయితే కర్ణాటక ఎన్నికలు పూర్తయ్యే నాటికే తెలంగాణలో పరిస్థితి చేయి దాటిపోయింది. ఈ మధ్య కాలంలో జరిగిన పరిణామాలే ఇందుకు కారణం. 2022 జూలైలో బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశాలు జరిగిన తర్వాత కొద్ది రోజులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీని కలిసినప్పుడు ఆయన తెలంగాణలో బిజెపి రాజకీయ భవిష్యత్ ఎలా ఉన్నదని అడిగారు. తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో జనసంఘ్ కాలం నుంచీ ఇప్పటి బిజెపికి కొంత బలం ఉన్నమాట నిజమేనని, బండి సంజయ్ ఆ జిల్లాల్లోనే కొంత ఊపు తేగలుగుతున్నారని, మిగతా జిల్లాల్లో పార్టీ బలహీనంగా ఉన్నదని చెప్పినప్పుడు ఆయన ఏకీభవించినట్లు కనపడింది. బయటనుంచి వచ్చిన నేతలతోనే కాదు, పార్టీలో కొందరు ముఖ్య నేతలతో సంజయ్‌కు సఖ్యత లేదన్న సమాచారం అప్పటికే ప్రధానమంత్రికి ఉన్నది. అయినా ఆయనకు సంజయ్ పట్ల ప్రత్యేకాభిమానం ఉన్న విషయం కూడా అర్థమైంది. నిజానికి ఆ సమయంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతోంది. పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి పలువురు నేతలు ఢిల్లీలో పొగబెట్టేందుకు ప్రయత్నించారు. సకాలంలో సరైన ర్యలు తీసుకుంటే బిజెపియే బిఆర్ఎస్‌కు ప్రధాన ప్రత్యర్థిగా అవతరించే అవకాశం ఉన్నదనే అభిప్రాయం ప్రబలుతున్న రోజులవి. అయితే ఆ తర్వాత జరిగిన మునుగోడు ఉప ఎన్నిక, ఇటీవలి కర్ణాటక ఎన్నికల ఫలితాల మధ్య వాతావరణం మారిపోయింది. సునీల్ బన్సల్ వంటి నేతలు యూపీలో చక్రం తిప్పి ఉండవచ్చు కాని తెలంగాణ వరకు వచ్చేసరికి ఆ చక్రాలు పనిచేసే అవకాశాలు కనపడలేదు. ఇప్పుడు కర్ణాటక ఎన్నికల తర్వాత బిజెపి నేతలు కింకర్తవ్య విమూఢులైనట్లు కనిపిస్తున్నారు. నిన్నటి వరకూ ఇతర పార్టీలనుంచి వచ్చిన నేతలు కొందరు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను గద్దె దించి తమకు పార్టీ పగ్గాలు అప్పజెబుతారని ఆశించారు. ఢిల్లీకి వచ్చి పార్టీ అగ్రనేతలను కలుసుకుని తమకు నాయకత్వం అప్పజెబితే పార్టీ విజయావకాశాలు మెరుగుపడేలా చేస్తామని చెప్పుకున్నారు. కాని ఎన్నిసార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టి కీలక నేతల్ని కలుసుకున్నా, సంజయ్‌ను మారుస్తారన్న విషయంలో వారికి నిర్దిష్టమైన హామీ ఏమీ లభించలేదు. కర్ణాటక ఎన్నికల ఫలితాలను చూసి అయినా పార్టీని రక్షించేందుకు తమకు నాయకత్వం అప్పగిస్తారన్న చిరు ఆశ మళ్లీ వారిలో బయలుదేరింది. కాని అదేమీ జరగదని గత వారం ఢిల్లీకి వచ్చిన ఈటల రాజేందర్ తదితరులకు కూడా స్పష్టమైపోయింది. సంజయ్‌ను మార్చే ప్రసక్తి లేదని తాజాగా హైదరాబాద్‌లో జరిగిన పార్టీ ఆఫీసు బేరర్ల సమావేశంలో బిజెపి జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో ఉంటూ అధిష్టానం మూడ్ గమనిస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా రంగంలోకి దిగి సంజయ్ నాయకత్వంలోనే తాము ఎన్నికలకు వెళతామని చెప్పారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో సిబిఐ కవితను అరెస్టు చేయకపోవడానికీ, తమ పార్టీకీ సంబంధం లేదని స్పష్టంగానే ప్రకటించారు. ప్రాప్తకాలజ్ఞుడు మాత్రమే కాదు, బిజెపి ఒరిజినల్ నాయకుడైన కిషన్ రెడ్డి ఇలాంటి ప్రకటన చేశారంటే అందుకు అనేక కారణాలుంటాయి. బిజెపి వంటి పార్టీలో బయటనుంచి వచ్చిన నేతలకు పగ్గాలు అప్పజెప్పడం అంతసులభం కాదు. తమ నాయకత్వంలో, తమ భావజాలంలో, తమ ప్రయోజనాలకు తగ్గట్లుగా ఉండగలిగిన నేతలకే అక్కడ ప్రాధాన్యముంటుంది. ముఖ్యంగా కాంగ్రెస్ సంస్కృతికి అలవాటుపడ్డ నేతలకు బిజెపి అధిష్ఠానం విలువ నివ్వడం అంత సులభం కాదు. అందరూ అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వా శర్మల్లా సంఘ్ భావజాలాన్ని పూర్తిగా జీర్ణించుకోలేరు. బిజెపి బలంగా ఉన్న కర్ణాటకలోనే యడ్యూరప్ప వంటి నేతలను సైతం పక్కకు పెట్టి మోదీ స్వయంగా రంగంలోకి దిగినప్పుడు తెలంగాణలో బయటి నుంచి వచ్చిన పార్టీ నేతల ఒత్తిళ్లకు ఆయన ఎలా లొంగుతారు? కర్ణాటక ఎన్నికల తర్వాత తెలంగాణలో ఇతర పార్టీలనుంచి బలమైన నేతలు చేరేందుకు వెనుకాడుతున్నారని, ఇప్పటికే చేరిన నేతలు వెనక్కి వెళ్లే విషయం ఆలోచిస్తున్నారనే ప్రచారం ప్రారంభమైంది. 'బిజెపిలో ఎవరూ చేరవద్దని, ఇక్కడ మాకే దిక్కు లేదని మా పార్టీ నేతలే చెబుతున్నారు' అని బండి సంజయ్ ఇటీవల ఢిల్లీలో ఒక సీనియర్ నాయకుడి వద్ద వాపోయినట్లు తెలిసింది. ఏమైనా హైదరాబాద్‌లో బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశాల తర్వాత ఆ పార్టీ బలోపేతమయ్యే బదులు నీరసించినట్లు, అప్పుడు నీరసించినట్లు కనపడ్డ కాంగ్రెస్ ఇప్పుడు పుంజుకుంటున్నట్లు కనపడుతోంది. తెలంగాణలో ఎన్నికలకు మరో ఆరు నెలల వ్యవధి మాత్రమే ఉన్నందువల్ల బిఆర్ఎస్‌కు బిజెపి ప్రధాన ప్రత్యర్థి అయ్యే అవకాశాలు మృగ్యంగా కనపడుతున్నాయి. 2018లో బిజెపి తెలంగాణలో కేవలం 6.98 శాతం ఓట్లు మాత్రమే గెలుచుకుంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి ఓటు శాతం 19.65కు పెరిగి 4 సీట్లు గెలుచుకున్నది. 21 అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రమే ఆధిపత్యం కనపరచింది. బిజెపి బాగా కష్టపడితే మహా అయితే ఈ అసెంబ్లీ స్థానాల్లోనే గట్టి పోటీ ఇవ్వగలుగుతుందేమోనని ఆ పార్టీ నేతలే అంటున్నారు. అందుకే తెలంగాణలో తమకు కాంగ్రెస్‌తోనే ప్రధాన పోటీ ఉన్నదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ఇప్పటికే ప్రకటించారు. ఈ నేపథ్యంలో దక్షిణాదిలో బిజెపి మనుగడ సాగించగలుగుతుందా అన్న చర్చ జరగాల్సిన అవసరం ఉన్నది. కేరళలో బిజెపి ఎంత కష్టపడ్డా ఆ పార్టీ ఓట్ల శాతం రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 16 శాతం నుంచి 11.51 శాతానికి పడిపోయింది. తమిళనాడులో 3.57 శాతం నుంచి 2.62 శాతానికి దిగజారిపోయింది. దక్షిణాదిన అన్ని రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా బలహీనంగా ఉన్న బిజెపి పూర్తిగా అయోమయ పరిస్థితిలో ఉన్నది. వైసీపీపై ఛార్జిషీటు తయారు చేయాలని ఇటీవల రాష్ట్ర బిజెపి నేతలు నిర్ణయించినప్పటికీ వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఆ పార్టీ ఏర్పాటు చేసిన శిబిరాలకు హాజరు కాలేదని ఢిల్లీకి నివేదిక అందింది. వైసీపీని ఎదుర్కొనే విషయంలో బిజెపికి చిత్తశుద్ధి లేదని ప్రజలే భావిస్తున్నట్లు కనపడుతోందని, బహుశా నాయకుల వైఖరే ఇందుకు కారణమని చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బాబాయి వివేకానంద రెడ్డి హత్య కేసులో వైసీపీ ఎంపి అవినాశ్ రెడ్డిని అరెస్టు చేసే విషయంలో సిబిఐలో ఊగిసలాట కనిపిస్తోంది. దీంతో బిజెపి, వైసీపీల మధ్య సంబంధం ఎంతగా పెనవేసుకుపోయిందో స్పష్టంగా తెలుస్తోంది.

# ఎంతమంది ఉసురు పోసుకుంటారు ?



రుచిక గిర్హోత్రా. గూగుల్ తల్లిని అడిగితే ఈమె గురించి అన్ని వివరాలు చెబుతుంది. అభం శుభం తెలియని 14 ఏళ్ల బాలిక. టెన్నిస్ నేర్చుకునేది. అప్పటి పోలీస్ అధికారి అయిన టెన్నిస్ అసోసియేషన్ నాయకుడి వేధింపులకు బలైంది. న్యాయం దొరకక, తన కారణంగా తమ్ముడు, మొత్తం కుటుంబం వేధింపులకు గురైన కారణంగా మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. అయితే సదరు పోలీస్ అధికారి మాత్రం డిజిపిగా పదోన్నతి పొందాడు. ఇదీ మన ఆడపిల్లలకు న్యాయం జరిగే తీరు. 'మాకు ప్రాణ హాని ఉంది. వేము నిత్యం వేధింపులకు గురవుతున్నాం'. ఈ ప్రకటన చేసింది వినేష్ ఫోగట్. దేశానికి పతకాల మీద పతకాలు సంపాదించి పెట్టిన, దేశం పరువు నిలబెట్టిన క్రీడాకారిణి. 'భారత కుస్తీ సమాఖ్య అధ్యక్షుడి మీద ఫిర్యాదు ఇచ్చిన వారితో సహా మా అందరి జీవితాలు ప్రమాదంలో ఉన్నాయి. మా కుటుంబాలకు బెదిరింపులు వస్తున్నాయి'. ఈ మాటలు వినేష్ జనవరి 18వ తేదీన మొట్టమొదట జంతర్‌మంతర్ దగ్గర ధర్నా చేసిన రోజే చెప్పింది. 'నేను ప్రధానమంత్రిని కలిసినప్పుడు కూడా ఇంత వివరంగా కాకపోయినా...మేం వేధింపులను ఎదుర్కొం టున్నాం. మాకు సహాయం చేయండి...అని విన్నవించు కున్నాన'ని కూడా చెప్పింది. తిరిగి ఏప్రిల్ 25వ తేదీన, మే 18వ తేదీన పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాకు చెప్పింది. అయితే ఇవన్నీ ప్రభుత్వానికి ఎందుకు అర్థం కావడం లేదు. ఇప్పటికి ఐదు నెలలుగా వాళ్ళు ఆందోళన చేస్తున్నారు. ఈ మహిళా క్రీడాకారులు నిజంగానే జీవితం ప్రమాదంలో పడేంత తీవ్రమైన ఇబ్బందులు అనుభవిస్తున్నారా. అంటే గతంలో జరిగిన ఘటనలు నూటికి నూరు శాతం నిజమనే చెప్తున్నాయి. ఒకసారి గతంలో ఏం జరిగిందో చూద్దాం. రుచిక గిర్హోత్రా. గూగుల్ తల్లిని అడిగితే ఈమె గురించి అన్ని వివరాలు చెబుతుంది. అభం శుభం తెలియని 14 ఏళ్ల బాలిక. టెన్నిస్ నేర్చుకునేది. అప్పటి పోలీస్ అధికారి అయిన టెన్నిస్ అసోసియేషన్ నాయకుడి వేధింపులకు బలైంది. న్యాయం దొరకక, తన కారణంగా తమ్ముడు, మొత్తం కుటుంబం వేధింపులకు గురైన కారణంగా మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. అయితే సదరు పోలీస్ అధికారి మాత్రం డిజిపిగా పదోన్నతి పొందాడు. ఇదీ మన ఆడపిల్లలకు న్యాయం జరిగే తీరు. వివరాల్లోకి వెళ్తే...రుచిక టెన్నిస్ క్రీడాకారిణి. చండీగఢ్ లోని సేక్రెడ్ హార్ట్ గర్ల్స్ హైస్కూల్లో 10వ తరగతి చదివేది. తండ్రి యూకో బ్యాంక్ మేనేజర్. తల్లి చిన్నప్పుడే చని పోయింది. సోదరుడు అషు. స్నేహితురాలు ఆరాధనతో కలిసి హర్యానా లాన్ టెన్నిస్ అసోసియేషన్‌లో టెన్నిస్ నేర్చుకునేది. ఇది ఎక్కడ ఉన్నదంటే, అప్పటి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పనిచేస్తున్న ఎస్‌పిఎస్ రాథోడ్ నివాస గృహం పక్కనే ఉండేది. అప్పట్లో ఇతగాడు హర్యానా లాన్ టెన్నిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా పని చేసేవాడు. ఆ హోదాలోనే రుచిక ఇంటికి వెళ్లి ఆ అమ్మాయి తండ్రితో మాట్లాడాడు. ఇది జరిగింది 1990 ఆగస్టు 11వ తేదీన. 'అమ్మాయి బాగా పైకి వస్తుంది. నా ఇంటికి పంపించండి. కోచింగ్ ఇస్తాను' అని చెప్పి వచ్చాడు. 12వ తేదీన స్నేహితురాలు ఆరాధనతో కలిసి రుచిక రాథోడ్ ఆఫీస్‌కి వెళ్లి కలిసింది. ఆ ఇద్దరు అమ్మాయిల్ని చూసిన ఈ పెద్ద మనిషి టెన్నిస్ కోచ్‌ని తీసుకురమ్మని చెప్పి ఆరాధనను బయటకు పంపించాడు. ఆ అమ్మాయి బయటకు వెళ్లిందో లేదో ఒంటరిగా ఉన్న రుచికను గట్టిగా పట్టుకొని దగ్గరకు తీసుకొని చెప్పరాని విధంగా ప్రవర్తించసాగాడు రాథోడ్. ఏదో విధంగా అమ్మాయి అతన్ని బయటకు నెట్టేసి ఇవతలకు వచ్చింది. అయినా అతని ధోరణి మారలేదు. బయటికి వెళ్లిన ఆరాధన లోపలికి వచ్చి జరిగిందంతా చూసింది. జరిగిన విషయం ఆడపిల్లలు ఇంట్లో వాళ్లకి చెప్పలేదు. అందరు ఆడవాళ్లు, ఆడపిల్లల్లాగే భయపడ్డారేమో. ఆ తర్వాత రోజున మళ్లీ టెన్నిస్ నేర్చుకోవడానికి వెళ్లారు. ఆ పిల్లలిద్దరినీ తన ఆఫీసుకు పిలిపించాడు రాథోడ్. ఇక దీంతో వారిద్దరు ఇంట్లో వాళ్లకి చెప్పారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఏదో ఒకటి చేయాలని నిర్ధారణకు వచ్చారు. పైఅధికారుల దృష్టికి తీసుకురావాలనుకున్నారు. ఆగస్టు 17 తేదీన హోం సెక్రటరీకి ఫిర్యాదు ఇచ్చారు. అధికారులు చర్యలు తీసుకుంటారని భ్రమపడతాం కదా. వారూ అలాగే అనుకున్నారు. అయితే కథ అక్కడితో ఆగలేదు. ముఖ్యమంత్రులు, హోంమంత్రులతో కలిసి నేరస్తుడ్ని రక్షించడానికి నాటకాలు మొదలెట్టారు. ఆ తర్వాత జరిగినదంతా తెలుసుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది. క్రైమ్ స్టోరీని తలపిస్తుంది. న్యాయం జరగకపోగా రుచిక కుటుంబాన్ని, మద్దతునిచ్చిన స్నేహితురాలు ఆరాధన కుటుంబాన్ని సర్వనాశనం చేశారు. ఇదంతా అధికారంలో ఉన్న పెద్దల అండతోనే సాగింది. సెప్టెంబర్ 17వ తేదీన హోం సెక్రటరీకి ఫిర్యాదు ఇచ్చాక...హోం సెక్రటరీ ఆర్.ఆర్. సింగ్ నివేదిక ఇచ్చారు. దాంట్లో స్పష్టంగా నేరం జరిగినట్లు చెబుతూ ఎఫ్ఐఆర్ తక్షణమే నమోదు చేయాలని సిఫార్సు చేశారు. ఆ కొద్ది కాలానికి ఆర్.ఆర్.సింగ్ స్థానంలో దుగ్గల్ హోం సెక్రటరీగా వచ్చాడు. సింగ్ ఇచ్చిన రిపోర్టు ఎక్కడ చెదలు పట్టిపోయిందో తెలియదు. నేరం చేసిన రాథోడ్ కి స్థానిక ఎమ్మెల్యేతో సహా అప్పటి ముఖ్యమంత్రి హుకుమ్ సింగ్, ఆ తరువాత వచ్చిన ఓం ప్రకాష్ చౌతాలా ప్రభుత్వాల అండదండలు దండిగానే ఉన్నాయట. బాలిక కుటుంబానికి మాత్రం వేధింపులు తారాస్థాయికి చేరాయి. మొదట స్కూల్ ఫీజు ఎగ్గొట్టిందని ఆరోపించి ఆ పిల్లని స్కూలు నుంచి బహిష్కరించారు. ఫీజులు కట్టని 135 మంది మీద మాత్రం ఒంటి మీద ఈగ వాల లేదు. ఈ బహిష్కరణను అడ్డం పెట్టుకొని ఆ పిల్ల మీద నిందా ప్రచారం తారాస్థాయిలో చేశారు. ఆ తల్లి లేని పిల్ల ఒకవైపు మానసిక వేదనతో గది నాలుగు గోడల మధ్య మగ్గిపోయింది. రాథోడ్ చెప్పుచేతల్లో ఉన్న పోలీస్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు తెల్ల చొక్కాల ముసుగులో ఆ కుటుంబం మీద ఒక కన్ను వేశారు. తండ్రి మీద, పది సంవత్సరాల తమ్ముడి మీద మర్డర్ కేసు, దొంగతనం కేసుతో సహా పెట్టని కేసులు అంటూ లేవు. కేసులు పెట్టి వేధించారు. పోలీస్ స్టేషన్లో పెట్టి చిత్రహింసలకు గురిచేశారు. సినిమాల్లో తప్ప మరెక్కడ చూడం ఇట్లాంటి చిత్రహింసలు. ఆ పిల్లాడు ఎట్లా బతికి బయటపడ్డాడో తెలియదు. మరో బాలిక ఆరాధన మీద పదికి పైగా కేసులు పెట్టారట. ఆమెను తండ్రి హర్యానా ప్రభుత్వంలో చీఫ్ ఇంజినీరుగా పనిచేసేవాడు. మచ్చలేని మనిషి. అటువంటి ఆయన మీద కేసులు మీద కేసులు పెట్టి చివరికి ఉద్యోగంలో నుంచి సస్పెండ్ చేయించారు. ఇవన్నీ చూసిన బాధితురాలు రుచిక మూడేళ్ల తర్వాత అంటే 1993 డిసెంబర్ 28న విషం తిని చనిపోయింది. అక్కడికి ఆ దుర్మార్గుడు కక్ష తీరలేదు. తండ్రి చేత బలవంతంగా తెల్ల కాగితాల మీద సంతకాలు పెట్టించుకుని గాని ఆ అమ్మాయి మృతదేహాన్ని తండ్రికి అప్పగించలేదు. ప్రభుత్వం ఈ కేసు ఫైలు మూసివేసింది. వేధింపులు తట్టుకోలేక కుటుంబం చండీగఢ్ నుంచి సిమ్లా దగ్గరకు పోయి మట్టి పని చేసుకుని బతికిందట. రాథోడ్ మాత్రం సంవత్సరం తర్వాత 1994లో అడిషనల్ డిజిపిగా పదోన్నతి పొందాడు. ఆ తర్వాత 1999లో ఓం ప్రకాష్ చౌతాలా ప్రభుత్వంలో డిజిపిగా పదోన్నతి పొందాడు. ఈ మొత్తం ఘటన మీద అప్పటి రాష్ట్ర స్థాయి బిజెపి నాయకుడు స్పందించాడట. అయితే కేంద్రంలో ఉన్నది వాజ్‌పేయి ప్రభుత్వమే కదా. వాజ్‌పేయి ప్రభుత్వానికి ఓం ప్రకాష్ చౌతాలా ప్రభుత్వం మద్దతు ఉంది కాబట్టి అన్ని రకాల మద్దతులు కలిపి ఒక ఆడపిల్లకి, ఒక భావి భారత క్రీడాకారిణికి అన్యాయం చేశారు. ఇదంతా పార్లమెంట్ వేదికగా కూడా చర్చ జరిగింది. అప్పుడు పార్లమెంటు సభ్యురాలుగా ఉన్న బృందాకరత్ కూడా రుచికకు న్యాయం జరగాలని పార్లమెంటును వేదికగా చేసుకుని పోరాడారు. ఇవన్నీ ఆనాటి ఇంగ్లీషు, హిందీ అన్ని పత్రికల్లోనూ ప్రముఖంగా ప్రచురించబడ్డాయి. చివరికి కేసు సిబిఐ చేతుల్లోకి వెళ్ళింది. కోర్టు దాకా వచ్చింది. నేరం జరిగిన 20 సంవత్సరాల తర్వాత 2010లో రాథోడ్ నేరం చేశాడని అంగీకరిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. ఏమైనప్పటికీ నేరస్తుడికి పదోన్నతి, బాధితురాలికి మరణం సంప్రాప్తించాయి. ఇదంతా చూశాక...బాధితులైన క్రీడాకారులు, వాళ్ళ కుటుంబాలు భయభ్రాంతులకు గురవుతున్నాయని అనడంలో ఏమైనా ఆశ్చర్యం ఉన్నదా. పుండు మీద కారం చల్లినట్లు 'వాళ్లు రోడ్డెక్కింది న్యాయం కోసం కాదు. రాజకీయాల కోసం' అన్న దుష్ప్రచారాలను సోషల్ మీడియా వేదికగా చూసిన వాళ్లకి బుర్ర వేడెక్కిపోవాల్సిందే. ప్రస్తుతం కుస్తీ క్రీడాకారిణులు పోరాడుతున్నది ఒక అధికార మదగజంతో అన్నది దేశ ప్రజలందరికీ అర్థం కావాలి. దేశానికి పతకాలు సాధించి పెట్టి, దేశం పరువు నిలబెట్టిన ఆడపిల్లల్ని రక్షించుకోవడానికి ఈ దేశ ప్రజ ఏం చేస్తున్నది? ఇది మనందరి ముందు ఉన్న ప్రశ్న!

## వాడికి నేర్పు

వాడికి రెక్క లిచ్చావ్
చిట్టి పొట్ట కోసమో
బుజ్జి గూడు కోసమో..
ఎలాగూ ఎగురుతాడు

పర్వతపు శిఖరం దాకా ఎగరమనో
తనదైన జెండా ఒకటి
పాతేసుకోమనోజి
ఆ రెక్కలను ఎలాగూ నిమురుతావ్

దిశ అదొకటేనా
నిర్దేశించేది రెక్కలకు మాత్రమేనా..
కాలి గోళ్ళ కూ కాస్త నేర్పు..!

ఆడపిల్లల్ని తన్నుకుపోయి
గుచ్చి గుచ్చి గాయం చేసి
పొడిచి పొడిచి..ప్రాణం తీసేసేందుకా..
వాడికి గోళ్ళున్నది..?
కొమ్మలను కరుచుకునేందుకు కదా..!

నేర్పితే గిర్పితే..
కల్మషం లేకుండా కరగడం నేర్పు
అమానుషాలకు..ఆగడాలకు
ఆమడదూరముండేలా నేర్పు
తల్లిని చెలిని..అక్కను చెల్లిని
అక్కున చేర్చుకోవడం నేర్పు

ఆక్షేపణ..ఆరడి
కూల్చి..కాల్చే విధ్వంసమూ..
జీవనాలలోకి చొరబడటం కాదు..!

ఆద్యంతం..
ఆడబిడ్డలకు తోడుగా ఎగర నివ్వడం నేర్పు
!
వివక్ష లెరుగని
పిట్ట దొడ్డ మనసును
లోయలలో ఎగిరే..రెక్కల బలాన్ని
రహదారుల్లో సంచరించే..నిర్భీతిని
సుప్రీం
ఆడపిల్లల్లోకి ఒంపమని నేర్పు
అడ్డదిడ్డంగా ఎగిరితే
వాడి రెక్కలను తెగేసే అవకాశం
ఎప్పుడూ ఉందనే నేర్పు..!

**- డా.దారల విజయ కుమారి**

## సంపూర్ణం...!

దాహాలు అసంపూర్ణంగానే
ఆరంభమౌతాయి.
ఆలోచనల సంఘర్షణలోంచి
ఒక దారి తళుక్కున మెరుస్తుంది.



ఒక లక్ష్యం
నిద్రలేని క్షణాల్ని వేలాడదీస్తుంది.

జీవితం
ఒక్కో పాదముద్రను చెక్కుతూ
నిరాడంబరంగా
విజయానికో చిరునవ్వు
విసురుకుంటూ ముందుకు పోతుంది.

ప్రతి క్షణమూ తిరిగిరానిదే.

ఇక్కడ ఛేదించాల్సినవి
చేయాల్సినవి కొన్ని వుంటాయి.

అలా అలా సంతోషాల్ని
లిఖిస్తూ కాస్త ముందుకు జరగాలి.

అసంపూర్ణం నుంచి సంపూర్ణానికి
ఒక్కో అడుగు తొడుగుతూ
ఒక్కో మైలురాయి లో చిహ్నాల్ని
కొన్ని తీపి గురుతులు గా నిలిపి
సంపూర్ణ ప్రయాణం గా
ప్రయత్నాల్ని మలచుకోవడం లోనే వుంది.
జీవితపు గెలుపు రహస్యం.

**- గవిడి శ్రీనివాస్**

## మన పేదల పెన్నిధి జగనన్న ని ముఖ్యమంత్రి చేసేలా ఆశీర్వదించాలి




పల్నాడు జిల్లా. నరసరావుపేట. మే 24 (ప్రజాపాలన ప్రతినిధి): నరసరావుపేట సకల సౌకర్యాలతో పూర్తైన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు నేడు ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నరసరావుపేట నరసరావుపేట గౌరవ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , పురపాలక మరియు పట్టణాభివృద్ధిశాఖ మాత్యులు ఆదిమూలపు సురేష్ కలిసి ప్రారంభించారు.పేదింటి కలను నెరవేర్చిన ఘనత మన ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి దక్కుతుందని ఈ సందర్భంగా లబ్దిదారులకు వారు వివరించారు..గత టిడిపి ప్రభుత్వం లో పేదలు ఈ టిడ్కో గృహానికి నాయకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగి లంచాలు ఇచ్చి,లక్షల రూపాయలు మరల తిరిగి చెల్లించాల్సి పరిస్థితి ఉండేదన్నారు.బిల్డింగ్ మాత్రమే కట్టేసి మౌళిక సదుపాయాలు కల్పించకుండా వదిలేశారని.నేడు జగనన్న ప్రభుత్వంలో ఉచితంగా త్రాగునీరు, డ్రెయినేజీ, కరెంట్ సదుపాయాలు కల్పించిందని...ఇవన్నీ అందించడంలో కొంత సమయం పట్టిందని తెలిపారు.ఈ రోజు ఈ గృహాలను చూసి లబ్దిదారులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారని, మళ్లీ మన పేదల పెన్నిధి జగనన్న ని ముఖ్యమంత్రి చేసేలా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమం లో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార రూపమే గడప గడపకు మన ప్రభుత్వం

**రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు ఎమ్మెల్యే చేతులమీదుగా రూ. 40 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



విజయవాడ ప్రజాపాలన, ప్రతినిధి : ప్రజా సమస్యల పరిష్కార రూపమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యకమం అని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 32వ డివిజన్ 228వ సచివాలయ పరిధి అయోధ్యనగర్ మెయిన్ రోడ్డు ఆర్చ్ నుంచి భారత సౌధ అపార్ట్మెంట్ వరకు., 229వ సచివాలయ పరిధి భారత సౌధ అపార్ట్మెంట్ నుంచి చివరి వరకు రూ. 40 లక్షల వ్యయంతో బి.టి. సర్ఫేస్ అప్ గ్రేడేషన్ పనులకు నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణి, స్థానికులతో కలిసి బుధవారం ఆయన భూమిపూజ నిర్వహించారు. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రూ. 20 లక్షల నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు సెంట్రల్లోని 66 వార్డు సచివాలయాల పరిధిలో గడప గడపకు కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేసుకోగా.. 61 పనులకు సంబంధించి రూ. 10.58 కోట్ల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. వీటిలో 14 పనులు పూర్తిచేసుకున్నట్లు వివరించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం నియోజకవర్గ ప్రగతిని పూర్తిగా గాలికొదిలేసిందని.. కానీ ఈ ప్రభుత్వంలో తాము చేపట్టిన పనుల గూర్చి ధైర్యంగా చెప్పగలగడమే కాకుండా, అభివృద్ధిలో ప్రజలను సైతం భాగస్వాములను చేస్తున్నట్లు మల్లాది విష్ణు తెలియజేశారు. కార్యక్రమంలో డీఈ (ఇంజనీరింగ్) గురునాథం, నాయకులు గుండె సుందర్ పాల్, ఒగ్గు గవాస్కర్, దుర్గాప్రసాద్, చంద్రమోహన్, ఆదిరెడ్డి, వీరంకి నాగు, అబ్రహాం, సాల్మన్, రంగబాబు, పేరం త్రివేణి రెడ్డి, పుష్పలత, సచివాలయ సిబ్బంది, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఎం ఈ ఓ అభినందనలు



ఏలూరు ప్రజా పాలన ప్రతినిధి : ఎంపిపి స్కూల్ విద్యార్థులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రవేశ పరీక్షలలో ప్రతిభను చాటారు. ఏప్రిల్ 2023 సంవత్సరంలో ఐదవ తరగతికి జరిగిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రవేశ పరీక్షలలో ఏలూరు జిల్లా, టి నరసాపురం మండలం, చిన్నగుర్వాయిగూడెంలోని ఎంపిపి పాఠశాల నుండి 12 మంది విద్యార్థులు పరీక్ష రాయగా మొదటి ఫేజ్ లోనే 8 మంది విద్యార్థులకు సీటు లభించింది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రవేశ పరీక్షలలో టి నరసాపురం మండల స్థాయిలోనే అత్యధిక మార్కులు (46/50) సాధించిన వేల్పుల రోవన్ ను ప్రధానోపాధ్యాయులు పి ఎస్ కళ్యాణి, ఎం ఈ ఓ టి రామ్మూర్తి అభినందించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రవేశ పరీక్షలలో సీట్లు సాధించిన విద్యార్థిని విద్యార్థులను, ఉపాధ్యాయులు వేల్పుల రవి కుమార్, మొహిద్దీన్ లను ఎం ఈ ఓ టి రామ్మూర్తి, కాంప్లెక్స్ చైర్మన్ నర్స మాంబ ప్రశంసించారు.

# అంగరంగ వైభవంగా టిడ్కో ఇళ్ళు పంపిణీ..

**ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా అభివృద్ధి ఎక్కడ ఆగలేదు**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రివర్యులు ఆదిములపు సురేష్**








పల్నాడు జిల్లా. నరసరావుపేట. మే 24 ( ప్రజా పాలన ప్రతినిధి.): పల్నాడు జిల్లా నరసరావుపేట నియోజకవర్గంలోని చిలకలూరిపేట రోడ్డులోని ఉన్న టిడ్కో గృహాలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన నరసరావుపేట గౌరవ శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మాత్యులు ఆదిమూలపు సురేష్, పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ , టిడ్కో చైర్మన్ ప్రసన్న కుమార్ మరియు పలువురు డైరెక్టర్లు, ఉన్నతాధికారులు. మంత్రివర్యులు ఆదిములపు సురేష్ మాట్లాడుతూ నరసరావుపేటలో 1504 గాను ఈ రోజు 459 టిడ్కో ఇళ్ళ గృహప్రవేశం చేసి ప్రారంభించుకోవడం జరిగింది, మిగతా వారికి త్వరలో టౌన్ హాల్లో మిగిలిన లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ కార్యక్రమం చేపడతామని అన్నారు, రాష్ట్రంలో 55 వేల పైచిలుకు ఇళ్లను పూర్తి చేసి రోడ్లు, డ్రైనేజి, మంచినీటి సరఫరా కరెంట్ అన్ని సదుపాయాలు కల్పించము అని అన్నారు. ప్రతిపక్షాలకు, ఎల్లో మీడియాకి మేము చేసే అభివృద్ధి కనిపించదా అని అన్నారు. టీడీపీ హయాంలో ఇళ్ళు నిర్మించి ప్రజలకు ఇవ్వలేకపోయింది.వైసీపీ ప్రభుత్వంలో అన్ని సదుపాయాలు కల్పించి ప్రజలకు అందించే కార్యక్రమలు చెప్పట్టాము. నరసరావుపేటలో కావాలనే టీడీపీ నాయకులు టిడ్కో గృహాలు ప్రజలకు అందకుండా కోర్టు కేసులు వేస్తూ అడ్డుపడుతున్నారు. గత ఎన్నికల ముందు టిడ్కో గృహాలు తూతూ మంత్రంగా నిర్మించి ఎలాంటి సదుపాయాలు కల్పించకుండా టీడీపీ నేతలు ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేశారు.ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఉచితంగా చేసి అందిస్తున్నాము, లబ్ధిదారులు బ్యాంకులకు కట్టిన రూ.50 వేలలో రూ.25 వేలు తిరిగి ఇచ్చే కార్యక్రమం చేస్తున్నాము, పూర్తి రూపాంతరం చేసి టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందిస్తున్నాము. పెద్దఎత్తున పాల్గొన్న లబ్ధిదారులు, తమ సొంతింటి కలను నిరవేర్చిన సీఎం జగన్ కు పాలాభిషేకం చేసిన లబ్ధిదారులు. ఈ సందర్భంగా నరసరావుపేట శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు కృతంత్రాలు చేసిన అభివృద్ధి ఎక్కడ ఆగలేదని అన్నారు అన్ని వస్తువులు వస్తువులతో ఇల్లు పూర్తి చేసి అందిస్తున్నామని అన్నారు మంచినీరు కరెంటు డ్రైనేజీ పూర్తి చేసి అందిస్తున్నామని అన్నారు త్వరలోనే పక్కన ఉన్న డంపింగ్ యార్డ్ ను తీసివేసి మంచి పార్కును ఏర్పాటు చేస్తున్నామని అన్నారు ప్రతివక్షాలు ఎన్ని మాట్లాడినా ప్రజలకు పూర్తి అభివృద్ధి మేము చేస్తున్నామని అన్నారు మెయిన్ రోడ్డు నుండి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామని పూర్తి వసతులతో లబ్ధిదారులకు అందిస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ అధికారులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## కొవ్వూరులో సిఎం కు ఘనస్వాగతం



కొవ్వూరు: ప్రజా పాలన ప్రతినిధి:జగనన్న విద్యా దీవెన రాష్ట్ర స్థాయి కార్యక్రమం లో పాల్గొనడానికి తొలిసారి కొవ్వూరు నియోజక వర్గం కు చేరుకున్న ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి కొవ్వూరు లోని హెలిప్యాడ్ వద్ద హెూం మంత్రి తానేటి వనిత, జిల్లా ఇంఛార్జి మంత్రి సిహెచ్. శ్రీనివాస్ వేణుగోపాల్ కృష్ణ, జిల్లా కలెక్టర్ కే. మాధవీలత, ఎస్పీ సిహెచ్. సుధీర్ కుమార్, మునిసిపల్ కమిషనర్ కె. దినేష్ కుమార్, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రోడ్ షో గా సభా ప్రాంగణానికి చేరుకున్న సిఎం కొవ్వూరు పట్టణ ప్రజలు దారి పొడవునా స్వాగతం పలికారు.రాష్ట్ర స్థాయి జగనన్న విద్యాదీవెన కార్యక్రమంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు విచ్చేసిన గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి ఆయన క్యాంపు కార్యాలయం నుంచి హెలికాప్టర్లో బయలుదేరి స్థానిక కేజీఎం హైస్కూల్ దగ్గర సిద్ధం చేసిన హెలిపాడ్ వద్దకు చేరుకున్న అనంతరం ప్రత్యేక బస్సులో రోడ్డు షో మొదలైంది. సీఎం కాన్వాయ్ కొవ్వూరు ఆర్టీసీ బస్సు స్టాండ్ మీదుగా రీటైల్ చికెన్ సెంటర్‌బీ అక్కయమ్మ కాలనీబీ గోకూరు ఎన్టీఆర్ క్రీడా మైదానంబీ సత్యవతి నగర్ మీదుగా రాష్ట్ర హెూం శాఖ మంత్రి తానేటి వనిత క్యాంప్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి సీఎం జగన్ మోహన్ రెడ్డి వాహన శ్రేణి చేరుకుంది.రోడ్ షో లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా బార్లు తీరిన జనం..సీఎం రోడ్డు షో మొదలైంది దగ్గర నుంచి



కాన్వాయ్ పొడువునా రోడ్డుకి ఇరువైపులా అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. తమ అభిమాన ముఖ్యమంత్రిపై ప్రజలు, విద్యార్థులు, చిన్నారులు పూల వర్షం కురిపించారు. మా నమ్మకం నువ్వే జగన్..జై జగనన్న.. అంటూ నినాదాలతో ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. తనపై అభిమానంతో కుసుమాక్షితులు కురిపిస్తున్న ప్రజలకు సీఎం జగన్ చిరునవ్వుతో అభివాదం చేస్తూ ముందుకు సాగారు.సభా కార్యక్రమాలు అనంతరం హెలిప్యాడ్ చేరుకున్న ముఖ్యమంత్రి ప్రజల నుంచి స్పందన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంలో హెలిప్యాడ్ వద్ద స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన వీడ్కోలు పలికారు. అనంతరం సిఎం గుంటూరు జిల్లా తాడేపల్లి కి బయలుదేరి వెళ్ళారు.

## రంపయర్రంపాలెంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు




గోకవరం ప్రజా పాలన మే 24: గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామంలో మంగళవారం అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు పై విజిలెన్స్, రెవెన్యూ, గనుల శాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు చేసి ఒక్క ఎక్స్కవేటర్, మూడు టిప్పర్ల వాహనాలు సీజ్ చేశారు. దీనికి సంబంధించి రాజమహేంద్రవరంనికి చెందిన రీజనల్ విజిలెన్స్ %఑% ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామంలోని అగ్రహారపు నాగమ్మ, భర్త అప్పారావుకు చెందిన సర్వే నెం 389/16లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు, రవాణా జరుగుతున్నది అన్న సమాచారముతో విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ , గనుల శాఖ అధికారులతో ఆ ప్రాంతాన్ని ఆకస్మికముగా తనిఖీ చేశారు. సర్వే నెంబర్ లో గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణా చేస్తున్న ఒక్క ఎక్స్కవేటర్, మూడు టిప్పర్లను అధికారులు గుర్తించారు. గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న ఒక్క ఎక్స్కవేటర్, మూడు టిప్పర్లను అద్దుకుని, గనుల, రెవెన్యూ సర్వేయర్‌లతో గ్రావెల్ తవ్విన గుంతల పిట్ వాల్యూమ్‌లను తీసుకుని తవ్విన గ్రావెల్ పరిమాణం 4,827 క్యూబిక్ మీటర్లుగా అంచనా వేశారు. సర్వే నెం 389/16లో అక్రమ గ్రావెల్ తవ్వకాలను మండలంలోని గుమ్మళ్ళదొడ్డి గ్రామానికి చెందిన మిర్తిపాటి వెంకట నాగ జ్యోతి స్వరూప్ నిర్వహిస్తున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలు తవ్వుతున్న సుమారు 36.00 లక్షల విలువ గల ఒక్క ఎక్స్కవేటర్, మూడు టిప్పర్ల వాహనాలు/మెషినరీలన్నీ సీజ్ చేసి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న నిర్వహకుడు తో పాటు భూ యజమాని, ఆపరేటర్లు, డ్రైవర్లపైన వాహనాలు/మెషినరీ యజమానులపైన గోకవరం రెవెన్యూ ఇన్స్పెక్టర్ గోకవరం పీఎస్‌లో క్రిమినల్ కేసు నమోదు కొరకు పిర్యాదు చేశారన్నారు. ఇంచార్జ్ రీజనల్ విజిలెన్స్ %఑% ఎన్ఫోర్స్మెంట్ అధికారి కె కుమార్ మాట్లాడుతూ గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణా పై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎవ్వరైనా గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖిలలో కార్యాలయ ఇన్స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్స్ లోవ కుమార్, వీరబాబు, రెవెన్యూ, గనుల శాఖ అధికారులు పాల్గొన్నారు . 3నెలల క్రితమే ఫిర్యాదు చేశా : జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ అక్రమ గ్రావెల్ తవ్వకాలు, రవాణా పై గత మూడు నెలల క్రితం అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళినట్లు గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన జాస్మిన్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ బత్తిన రామకృష్ణ తెలిపారు.

## మ్యాంగో టౌన్ ప్రెస్ క్లబ్ లోగో ఆవిష్కరించిన సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

**గుర్తింపు కార్డులు ఆవిష్కరించిన డిపిఆర్ఓ దుర్గాప్రసాద్ అతిథులకు ఘన సన్మానం**



నూజివీడు, మే 24, ప్రజాపాలన ప్రతినిధి: నిస్వార్ధంగా సామాజిక సేవకు ముందుకు వచ్చే ఏకైక వర్గంగా జర్నలిస్టులు సమాజంలో కనిపిస్తున్నారని సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. నూజివీడు పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహ ఆవరణలో బుధవారం నాడు మ్యాంగో టౌన్ ప్రెస్ క్లబ్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విధమైన లాభాపేక్ష లేకుండా సమాజంలోని సమస్యల పరిష్కారం కోసం అక్షర యజ్ఞం చేస్తున్న జర్నలిస్టులు అభినందనీయులన్నారు. యాజమాన్యాల నుండి వేతనాలు కూడా సరిగా అందకపోయినా... అసలు రాకపోయినా నిబద్ధతతో వృత్తిని కొనసాగిస్తూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు ఆదర్శనీయంగా నిలిచారని హర్షద్వానాల నడుమ ప్రకటించారు. తన వంతుగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జర్నలిస్టుల గుర్తింపు కార్డులను ఆవిష్కరించిన ఏలూరు జిల్లా డివిజనల్ పిఆర్ఓ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎంతో ఐక్యత చాటుతూ జర్నలిస్టులు జరుపుకున్న గొప్ప పండుగలా ఉన్నదని అభినందించారు. ఈ ఐకమత్యం ఎల్లవేళలా కొనసాగాలని అభిలాషించారు. శాఖా పరంగా తన వంతు సహకారం ఎల్లవేళలా అందిస్తానని పాత్రికేయులకు ఈ సందర్భంగా హామీ ఇవ్వడం జరిగింది. సీనియర్ పాత్రికేయులు వై ఎస్ ఎం ఎస్ సీతారామరాజు మాట్లాడుతూ పాత్రికేయుల్లో ఎల్లవేళలా ఐక్యత కొనసాగాలని, సామాజిక స్పృహతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ, పాత్రికేయుల సమస్యల పరిష్కారం కోసం నడుం బిగించాలని సూచించారు. మ్యాంగో టౌన్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షునిగా ఎన్నికైన నిమ్మగడ్డ రతీష్ బాబు మాట్లాడుతూ తనపై పాత్రికేయ మిత్రులు ఎంతో గొప్ప బాధ్యత ఉంచారని, నమ్మకంతో తనకు అందించిన బాధ్యతను నూటికి నూరు శాతం నిర్వహించి పదవికి వన్నెతెస్తానని, పాత్రికేయ మిత్రుల సమస్యల పట్ల అనుక్షణం స్పందించి పరిష్కరించే దిశగా అందరి సహకారంతో ఐక్యంగా కృషి చేస్తామని అన్నారు. సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఏలూరు జిల్లా డివిజనల్ పిఆర్ఓ దుర్గాప్రసాద్ లను పాత్రికేయులు ఘనంగా సన్మానించారు. మ్యాంగో టౌన్ ప్రెస్ క్లబ్ ను ఏర్పాటుచేసిన అనంతరం ఏకగ్రీవంగా ఎన్నుకున్న నూతన కార్యవర్గాన్ని పాత్రికేయులు ప్రకటించారు. మ్యాంగో టౌన్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గా నిమ్మగడ్డ రతీష్ బాబు, ఉపాధ్యక్షులు పోలిమెట్ల జాన్ ప్రకాశం, కార్యదర్శి కసుకుర్తి నాగార్జున చౌదరి, సహాయ కార్యదర్శి బొల్లి పాము రవికాంత్, కోశాధికారి రుద్రపాటి బాబు రాజేంద్రప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా కంభం రవిశేఖర్, పండుల ఉదయ్ కుమార్, మిద్దె వీరాంజనేయులు, మోచర్ల మహేష్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

## చిట్వేలి మానవతా సేవా సంస్థకు ఆర్థిక సాయం చేసిన ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి



అన్నమయ్య జిల్లా : ప్రజాపాలన ప్రతినిధి: చిట్వేలి మండల కేంద్రంలోని స్థానిక గ్రామ ఉప సర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డి చిట్వేలి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థకు బుధవారం 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు చిట్వేలి మానవతా సేవా సంస్థలో సహకార అధ్యక్షులుగా కొనసాగుతున్నారు బుధవారం తన వివాహ దినోత్సవం సందర్భంగా మానవతా సంస్థకు ఆర్థిక సహాయం అందజేశారు స్థానిక మానవతా సభ్యులు చైర్మన్ మురళి, కుంభగిరి మునిరావు మానవతా సంస్థ తరఫున చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డి దంపతులకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## చిట్వేలి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కొరుముట్ల




అన్నమయ్య జిల్లా :ప్రజాపాలన ప్రతినిధి: చిట్వేలి మండల కేంద్రంలోని బుధవారం ఎంపీడీవో కార్యాలయం నందు జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో మండల అధ్యక్షులు టంగుటూరి చంద్ర అధ్యక్షతన నిర్వహించారు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రభుత్వ విప్ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు ఆయన మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు గ్రామాలలో ఎంపిటిసిలు సర్పంచులు వార్డు కౌన్సిలర్లతో సంప్రదించి అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొరుముట్ల శ్రీనివాసులు తెలియజేశారు అలాగే పూర్తయిన సచివాలయ భవనాలను జూన్ నెలలో ప్రారంభిస్తామని తెలియజేశారు అంగన్వాడి సచివాలయ భవనాలను రైతు భరోసా కేంద్రాలను అధికారులు త్వరగా పూర్తిచేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్ర, వైస్ ఎంపీపీ సుబ్రహ్మణ్యం రెడ్డి, మండల సీనియర్ నాయకులు ఎల్వి మోహన్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు అన్సర్ భాష, తాసిల్దార్ మురళికృష్ణ, ఎంపీడీవో మోహన్, ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, ఏపీవో చంద్రకళ,సుధాకర్ రాజు సర్పంచులు ,ఎంపీటీసీలు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేడు కె ఎస్ అగ్రహారంలో ఘనంగా గంగమ్మ జాతర



అన్నమయ్య జిల్లా :ప్రజాపాలన ప్రతినిధి: చిట్వేలి మండల కేంద్రంలోని కంప సముద్రం పంచాయతీ అగ్రహారం గ్రామంలో గంగమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు బుధవారం తెల్లవారుజామున గంగమ్మ విగ్రహాన్ని తయారుచేసి అగ్రహారంలో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేప మండల గుడిలో అమ్మవారిని కొలువు తీరుస్తారు ఊరేగింపుగా తీసుకువచ్చే సమయంలో భక్తులు బలులు సమర్పించి మొక్కుబడులను తీర్చుకుంటారు అత్యంత వైభవంగా జరిగే గంగమ్మ జాతర గురువారం చివరి రోజు ఎడ్ల బండ్లతో గుడి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహిస్తారు అలాగే గురువారం గంగమ్మ జాతర పనులను పర్యవేక్షిస్తున్న మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ శేషం రాజు రెవెన్యూ అధికారి భుజంగరావు వారు మాట్లాడుతూ గంగమ్మ జాతరకు వచ్చే భక్తులకు గ్రామ ప్రజలకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని గ్రామ ప్రజలకు పెద్దలకు తెలియజేశామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో కె ఎస్ అగ్రహారం గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## చిరుధాన్యాల విత్తనాలు ఎంతో లాభదాయకం: వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి



చీరాల, మే 24, ప్రజాపాలన : భూమిని సారవంతం చేయడానికి, చిరుధాన్యాల విత్తనాలు ఎంతో లాభదాయకమని, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి స్పష్టం చేశారు. చీరాల మండలం, తోటవారిపాలెం పంచాయతీ ఆర్ బి కే పరిధిలో, రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో, ప్రకృతి వ్యవసాయంవారు భూసారం పెంచేందుకు,చిరుధాన్యాల విత్తనాలను రైతులకు పంపిణీ చేసేకార్యక్రమంలో, ముఖ్య అతిథిగా చైర్మన్ రమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ, 30 రకాల చిరుధాన్యాల విత్తనాలను కలిపి ఎక రాకు 6 కిలోల విత్తనాలు చల్లి, అవి కొంతమేర పెరిగిన తర్వాత భూమిలో కలిగి ఉండాలని, అలా చేయుట ద్వారా భూమికి నాలుగు ట్రాక్టర్ల పశువుల ఎరువు అందజేసినట్లవుతుందని రైతులకు వివరించారు. చిరుధాన్యాల విత్తనాలను ప్రదర్శించిన అనంతరం రైతులకు పంపిణీ చేశారు. రైతులకు వ్యవసాయం లాభ సాటిగా ఉండేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, ఈ సందర్భంగా చైర్మన్ రమణారెడ్డి ఆయా సంక్షేమ పథకాలను రైతులకు వివరంగా తెలియ జేశారు. రైతులు ఆయా సంక్షేమ పథకాలను సద్వినియోగ పరుచుకుని, ఆర్థికంగా నిలద్రొక్కుకునేందుకు, ఎమ్మెల్యే బలరాం వైసిపి ఇన్చార్జి వెంకటేష్ లు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి తో పాటు ఆర్బికే అధికారిణి ప్రసన్న, మండల ప్రకృతి వ్యవసాయ పి.ఆర్.పి శ్రీనివాస రెడ్డి, వి సి ఆర్ పి లు శిరీష, కవిత, స్వరూప, పావని, రాణి, సభ్యులు గండూరు. వెంకట్రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ల లో ఎమ్మెల్యే బలరామ్



చీరాల, మే 24, ప్రజాపాలన : చీరాల మండలం దేవాంగపురి పంచాయితీ పరిధిలోని, హస్తి నాపురంలో, శ్రీ పోలేరమ్మ అమ్మ వారి తిరు నాళ్ళ మహో త్సవం కనుల పండువగా, అత్యంత ఘనంగా జరిగింది. ఈ తిరునాళ్ళ మహోత్సవ కార్యక్రమంలో, గౌరవ అతిథిగా చీరాల శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణ మూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలరామ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత స్థానిక వైసిపి నాయకులు, పోలేరమ్మ అమ్మవారి దేవస్థాన కమిటీ ప్రతినిధులు,ఎమ్మెల్యే బలరామ్ కు ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రతిని ధులు ఎమ్మెల్యే బలరాంకు మర్యాదపూర్వకంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మాజీ జడ్పీ టీసీ పృధ్వి అరుణ, పృధ్వి ధనుంజయ, పృథ్వి శేషు, పృథ్వి సుబ్బారావు, ఆసోది అంకాళ రెడ్డి, సజ్జ పవన్, బక్కా చిన అద్దంకి రెడ్డి, వ్యవసా య సలహా మండలి చైర్మన్ కావూరి రమణారెడ్డి, కళ్ళ గుంట అంజమ్మ,లేళ్ల శ్రీధర్,బిట్రా శ్రీను, బుర్ల శివ, బొమ్మిడి నాగరాజు తదితర నాయ కులు పాల్గొన్నారు.

## సెయింట్ ఆన్స్ లో విజయ వంతంగా ముగిసిన ఐసెట్ పరీక్షలు



చీరాల, మే 24, ప్రజాపాలన : సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి, చీరాలలో ఎ.పి ఐ సెట్ – 2023 పరీక్షలు బుధవారం కళాశాల టీ.సియస్. ఐయాన్ సెంటర్ నందు, విజయవంతం గా నిర్వహించినట్లు, కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణా రావు తెలియజేశారు. ఆంధ్ర ప్రదేశ్ లో యం.బి.ఎ., యం.సి.ఎ కోర్సులలోఅడ్మీషన్ల కోసం, శ్రీ కృష్ణ దేవరాయ యూనివర్సిటీ, అనంతపూర్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న , ఎ.పి ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ –2023 పరీక్షలు, కళాశాలలోని టి.సి.యస్ ఐయాన్ సెంటర్ నందు, ఆన్లైన్ లో నిర్వహించినట్లు, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ యస్.వి.డి అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భముగా విద్యాశాఖ వారి నిబంధనలను అనుసరించి అభ్యర్థులను పరీక్షా కేంద్రం లోనికి అనుమతించటం జరిగిందని తెలియజేశారు. ఈ పరీక్షను ఉదయం 9 నుండి గం.11.30 వరకు, సాయంత్రము 3 నుండి 5.30 గంటల వరకు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు పందిళ్ళ పల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ వారు విద్యార్థులకు అవసరమైన ప్రాధమిక చికిత్స సౌకర్యాలను అందజేశారు.ఎ.పి.ఐ సెట్ – 2023 పరీక్షకు, ఉదయం 240మంది అభ్యర్థుల కు గాను 221 మంది అభ్యర్థు లు, సాయంత్రము 240 మందికి గాను 220 మంది, మొత్తము 480 మందికి గాను 441 మంది హాజరైనట్లు తెలిపారు. ఈ పరీక్షలకు ప్రొఫెసర్ ఆర్.వి.యస్.యస్. యన్.రవి కుమార్ పరిశీలకు లుగా విచ్చేశారు.

## పోలేరమ్మ అమ్మ వారి పొంగళ్ళు కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి ఇంచార్జి వెంకటేష్



చీరాల, మే 24, ప్రజాపాలన : చీరాల మండలం దేవాంగపురి పంచాయితీ పరిధిలోని, హస్తినా పురంలో పోలేరమ్మ అమ్మ వారి పొంగళ్ళు సందర్భంగా,అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తుల సమిష్టి సహకారం తో ఏర్పాటు చేసిన ఆత్మీయ విందుకు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరాల నియోజక వర్గ ఇంచార్జి కరణం వెంకటేష్ హాజరైయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆల య కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు ఇంచార్జి వెంకటేష్ కు సాదరస్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ పృధ్వి అరుణ, పృధ్వి ధనుం జయ, పృథ్వి శేషు, పృథ్వి సుబ్బా రావు, ఆసోది అంకాళ రెడ్డి, సజ్జ పవన్,బక్కా చిన అద్దంకి రెడ్డి, లేళ్ల శ్రీధర్, బిట్రా శ్రీను, బొడ్డు సుబ్బారావు, గవిని నారాయణ, నర్రా బ్రహ్మ య్య,తదితర నాయకులు పాల్గొన్నారు.

## డైవర్సిఫైడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ విస్తరణ ప్రణాళికల ఆవిష్కరణ

విజయవాడ ,ప్రజాపాలన ప్రతినిధి మే 24 : ప్రముఖ డైవర్సిఫైడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ అబాన్స్ హెర్లిడ్డింగ్స్ లిమిటెడ్ 2023 ఆర్థిక సంవత్సరంలోని నాలుగో త్రైమాసికానికి (క్యూ4) బలమైన ఆర్థిక పనితీరును ప్రకటించింది. కంపెనీ వివిధ ఆర్థిక కొలమానాలలో గణనీయమైన వృద్ధిని ప్రదర్శించింది. తద్వారా పరిశ్రమలో కీ ప్లేయర్గా తన స్థానాన్ని బలోపేతం చేసుకుంది.2023 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ నికర లాభం రూ.70.3 కోట్లు, 2022 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన రూ.61.8 కోట్ల నికర లాభంతో పోలిస్తే 14 శాతం వృద్ధి నమోదైంది. 2023 ఆర్థిక సంవత్సరంలో నిర్వహణ లాభం అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 15 శాతం పెరిగి రూ.76 కోట్లకు చేరింది. 2022 ఆర్థిక సంవత్సరంలో కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం రూ.638.62 కోట్లతో పోలిస్తే 2023 ఆర్థిక సంవత్సరంలో 80.2 శాతం వృద్ధితో రూ.1,150.97 కోట్లుగా నమోదైంది. ఏజెన్సీ ఆదాయం గత ఏడాది కంటే 83 శాతం పెరిగి 2023 మార్చి నాటికి రూ.43 కోట్లకు చేరుకుంది. 2023 ఆర్థిక సంవత్సరంలో ఈపీఎస్ ఒక్కో షేరుకు రూ.14.81గా ఉంది. నికర ఎన్పీఏసున్నా వద్ద కొనసాగడం ద్వారా కంపెనీ బలమైన రిస్క్ మేనేజ్ మెంటును కొనసాగిస్తోంది.తన బలమైన ఫలితాలతో పాటు, అబాన్స్ హెర్లిడ్డింగ్స్ తన వ్యూహాత్మక విస్తరణ ప్రణాళికలను వివరించింది. భవిష్యత్తు వృద్ధిని నడిపించడం, ఈ దిగువ పేర్కొన్న కీలక రంగాలలో తన నాయకత్వ స్థానాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.



కనకదుర్గ వైన్స్ పైన బిల్డింగ్ లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వ్యక్తి వంకదారి వెంకటనారాయణ 60 ఎంప్లాయిస్ కాలనీ గుర్తింపు. ఇట్టి మృతదేహాన్ని పోలీసుల సమక్షంలో ఆర్కే ఫౌండేషన్ రెస్క్యూ టీం డాక్టర్ దోర్నాల రామకృష్ణ జ్యోతి ఆర్కే సుదర్శన్ సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది.



ఉమ్మడి గుంటూరు జిల్లా కామన్ బోర్డ్ జరిగిన అన్ని ఉపాధ్యాయ సంఘాలు తో RJD, DEO, dy deo ఆధ్వర్యంలో సమావేశమై ఉపాధ్యాయుల సమస్యలను అధికారులకు వివరిస్తూ ఉపాద్యాయ బదలీ,ప్రమోషన్ ప్రకియ లో ఉపాద్యాయ సమస్య లు పరిష్కారం చేయాలనీ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు కు వినతిపత్రం ఇచ్చిన గుంటూరు జిల్లా ఎపిటిఎఫ్ జిల్లా ప్రదాన కార్యదర్శి మేకల సుబ్బారావు, అసోసియేట్ అధ్యక్షులు పి.రమేష్

## జగనన్న భూ శాశ్వత హక్కు డ్రోన్ కెమెరాలు ప్రారంభించిన బుర్రా..

కనిగిరి :ప్రజాపాలన ప్రతినిధి: జగనన్న ప్రభుత్వం ఎంతో



ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భూ శాశ్వత హక్కు శాటిలైట్ డ్రోన్ కెమెరాలను కనిగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కనిగిరి శాసనసభ్యులు, టిటిడి పాలకమండలి సభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ ప్రారంభించారు. భూములు ఉన్నా రైతులకు శాశ్వత భూహక్కు కల్పించడమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని బుర్రా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, వైస్ చైర్మన్ మాణిక్యరావు, సంగు సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు కౌన్సిలర్ వేల్పుల వెంకటేశ్వర్, తమ్మినేని సుజాత, రాజీవ్, పులి శ్రీను, దాసరి మురళి, బి భాస్కర్ రెడ్డి, తిరుపతిరావు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థలో అథమ స్థాయిలో ఏపీ: వీరాంజనేయస్వామి

అమరావతి: ప్రజాపాలన ప్రతినిధి: విద్యా వ్యవస్థలో ప్రథమ స్థాయిలో ఉండాల్సిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అథమ స్థాయి లోకి జగన్ ప్రభుత్వం చేర్చిందని టీడీపీ నేత డోలా బాల వీరాంజనేయస్వామి విమర్శించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఏటా 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజ్ రీయంబర్స్ మెంట్ అందిస్తే.. జగన్ రెడ్డి కేవలం 10 లక్షల మందికి.. అదీ విడతల వారీగా అందిస్తోందని ఆరోపించారు. 2020-21లో 1 విడత, 2022-23లో 2 విడతలు, మొత్తం 3 విడతలు ఎగనామం పెట్టారన్నారు. ఈ 4 ఏళ్లల్లో విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా రూ.4,500 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు.ఫీజలు పెండింగ్ పెట్టడం వలన దాదాపు 2 లక్షల మంది విద్యార్థులు రోడ్డు పాలయ్యారని డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ మీద గొప్పలు చెప్పి తల్లిదండ్రులతో అప్పులు చేయిస్తూ విద్యార్థులను ముప్పు తిప్పలు పెట్టిస్తున్నారన్నారు. పీజీ విద్యార్థులకు ఫీజ్ రీయంబర్స్ మెంట్ రద్దు చేసి వెనకబడిన వర్గాలకు ఉన్నత విద్యను దూరం చేశారని, పాత పథకాలకు కొత్త పేర్లు పెట్టి పత్రికా ప్రకటన పేరుతో సాక్షి పత్రికకు దోచిపెడుతున్నారని డోలా బాల వీరాంజనేయస్వామి తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు.


## దస్తావేజులు పోయినవి

దస్తావేజు నంబరు 5124/2021. బాపట్ల మున్సిపాలిటీ ఏడో వార్డు శాంతినగర్ నివాసము ,డోర్ నెంబర్ 2-8-65 ఇంటి ప్రక్కన గల సర్వే నంబర్ 600/10 చ.గా 145-2 సెంట్లు. , దస్తావేజు నంబరు 1500/1998. బాపట్ల మున్సిపాలిటీ ఏడో వార్డు శారదాపురి కాలనీ ప్రక్కనగల డోర్ నెంబర్ 2-8-25హెచ్, పడమర బాపట్ల సర్వే నంబర్ 595/3 చ.గా 414.59 సెంట్లు గల డాక్యుమెంట్స్ పోయినవి దొరికిన వారు ఈ కింది నెంబర్కు సంప్రదించగలరు 7416357551

# గొల్లపల్లి గంగ జాతర కు ఆర్కాట్ కృష్ణప్రసాద్



పుత్తూరు మండలం, ప్రజాపాలన ప్రతినిధి: రామకృష్ణాపురం పంచాయితీ , గొల్లపల్లి నందు గంగ జాతర సందర్భంగా తిరుపతి జిల్లా కాపు సంక్షేమ యువసేన అధ్యక్షులు శ్రీరామ్ గోపి ఆహ్వానం మేరకు కాపు సంక్షేమ యువసేన రాష్ట్ర అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ గంగమ్మ తల్లి దర్శనార్థం విచ్చేసారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాపు సంక్షేమసేన కార్యదర్శి గోపి రాయల్ విచ్చేసి కృష్ణప్రసాద్ ను సాదరంగా ఆహ్వానించి గంగమ్మ తల్లి కి పూజలు చేయించి తరువాత శాలువాతో సత్కరించి అమ్మవారి పసుపు ,కుంకుమ, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాపు సంక్షేమ యువసేన అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ గోపి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు లక్ష్మి , తిరుపతి కాపు సంక్షేమ యువసేన ఇంచార్జి సాయి కుమార్, మునికృష్ణయ్య ,జానకిరామ్ , రాంప్రసాద్ , చక్రవర్తి , హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ శ్రీ సాయికి మాతృవి యోగం... నివాళులు...

గుంటూరు – మే 24 :ప్రజాపాలన ప్రతినిధి: ప్రైమ్ 9 న్యూస్ ఛానల్ ఎడిటర్, సీనియర్ జర్నలిస్ట్ చుండూరి సాయికి మాతృవియోగం కలిగింది. శ్రీమతి కృష్ణకుమారి (74) విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం 7:50 గంటలకు స్వర్గస్తులయ్యారు. సాయి తండ్రి దివంగత నాగేశ్వరరావు ఆంధ్రభూమి పత్రిక కు కృష్ణాజిల్లా కూచిపూడి లో విలేఖరిగా పనిచేస్తూ మూడేళ్ల క్రితం స్వర్గస్తులయ్యారు. విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మ రాజు చలపతిరావు తోపాటు పలువురు జర్నలిస్టులు గుంటూరులోని సాయి నివాస గృహానికి వెళ్లి శ్రీమతి కృష్ణకుమారి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సాయిని పరామర్శించారు. అంత్యక్రియలు జరిగాయి.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
ద.మ.రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in లో చూడవచ్చును

టె. ప్రకటన నం. Dy.CE/GS/SC/17-19/2023/OT తేది: 19.05.2023

PUB/0541

భారత రాష్ట్రపతి తరఫున దిగువ సంతకందారు దిగువ పనుల కొరకు 12.06.2023న 14.00 గం.వరకు ఇ-టెండరు కోరుతున్నారు.

క్ర.సం.1, ఇ-టెండరు నం. 17_GS_SC_23_OT, పనిపేరు: SC డివిజన్/ గతి శక్తి యూనిట్ : BPQ-KZJ సెక్షన్ - PDPL : కాజీపేట-బల్హార్షా మెయిన్ లైన్ ను పెద్దపల్లి- కరీంనగర్ లైన్‌కు కలుపుట కొరకు పెద్దపల్లి వద్ద కొత్త బైపాస్ లైన్ కోసం BG ట్రాక్ వేయుట మరియు కలుపు ప్రతిపాదన, పాయింట్స్&క్రాసింగ్స్, SEJలు & GJలు మొ. వాటి యొక్క అసెంబ్లింగ్ మరియు ఇన్సర్షన్, రాతికంకర సరఫరా, లోడింగ్ మరియు డంపింగ్, ప్రస్తుతం ఉన్న ట్రాక్ మరియు పాయింట్స్&క్రాసింగ్స్ యొక్క డిస్‌మాంట్లింగ్ మరియు స్లూయింగ్, ఫార్మేషన్, బ్లాంకెటింగ్‌లో మట్టి పని, కనీస ప్యాసెంజర్ సదుపాయాలతో వంతెనలు నిర్మాణం(2 నం.లు), కొత్త స్టేషన్ భవనం నిర్మించుట మరియు ఇతర సకల విధ పనులు చేపట్టుట. సుమారు టెండరు విలువ: రూ. 10,62,42,738/-, బయానా: రూ. 6,81,200/-, నెలలలో పూర్తిచేయు కాలం: 12 నెలలు, నెలలలో నిర్వహణ కాలం: 36 నెలలు.

క్ర.సం.2, ఇ-టెండరు నం. 18_GS_SC_23_OT, పనిపేరు: సికింద్రాబాద్ డివిజన్-గతి శక్తి యూనిట్ - కాజీపేట-బల్హార్షా సెక్షన్‌లోని 21(ఇరవై ఒకటి) లెవల్ క్రాసింగ్స్ స్థానంలో ROBలు నిర్మించుట కొరకు డెవలప్‌మెంట్ మరియు GADల తయారీ కొరకు కన్సల్టెన్సీ సేవలు; వయాడక్ట్ స్పాన్‌లు మరియు అప్రోచ్‌లతో పాటు రోడ్ ఓవర్ బ్రిడ్జి/రోడ్ అండర్ బ్రిడ్జి యొక్క ఫౌండేషన్, సబ్ స్ట్రక్చర్ అండ్ సూపర్ స్ట్రక్చర్ కొరకు సవివర ప్రాజెక్ట్ రిపోర్ట్, సవివర డ్రాయింగులు మరియు డిజైన్ తయారీ; రీఇన్‌ఫోర్స్‌డ్ ఎర్త్ వాల్ రిటైనింగ్ వాల్ మరియు యొక్క డిజైన్, ఫౌండేషన్, స్ట్రక్చర్ మరియు ఆర్ ఈ వాల్ /రిటైనింగ్ వాల్ డిజైన్ యొక్క ప్రూఫ్ చెకింగ్; BOQ తయారీ; సవివర అంచనా తయారీ; తుది స్థల సర్వే నిర్వహించుట; భూసేకరణ ప్రతిపాదనలు తయారీ; సంబంధిత కోడ్స్ /మాన్యువల్స్ ప్రకారం సాంకేతిక స్పెసిఫికేషన్లతో భూ సాంకేతిక పరిశోధన నిర్వహించుట మరియు బిడ్ డాక్యుమెంట్ తయారీ. సుమారు టెండరు విలువ: రూ. 2,58,01,146/-, బయానా: రూ. 2,79,000/-, నెలలలో పూర్తిచేయు కాలం: 180 రోజులు, నెలలలో నిర్వహణ కాలం: 06 నెలలు.

క్ర.సం.3, ఇ-టెండరు నం. 19_GS_SC_23_OT, పనిపేరు: సికింద్రాబాద్ డివిజన్-గతి శక్తి యూనిట్ - కాజీపేట-బల్హార్షా సెక్షన్‌లోని 10(పది) లెవల్ క్రాసింగ్స్ స్థానంలో ROBలు నిర్మించుట కొరకు డెవలప్‌మెంట్ మరియు GADల తయారీ కొరకు కన్సల్టెన్సీ సేవలు; వయాడక్ట్ స్పాన్‌లు మరియు అప్రోచ్‌లతో పాటు రోడ్ ఓవర్ బ్రిడ్జి/రోడ్ అండర్ బ్రిడ్జి యొక్క ఫౌండేషన్, సబ్ స్ట్రక్చర్ అండ్ సూపర్ స్ట్రక్చర్ కొరకు సవివర ప్రాజెక్ట్ రిపోర్ట్, సవివర డ్రాయింగులు మరియు డిజైన్ తయారీ; రీఇన్‌ఫోర్స్‌డ్ ఎర్త్ వాల్ రిటైనింగ్ వాల్ మరియు యొక్క డిజైన్, ఫౌండేషన్, స్ట్రక్చర్ మరియు ఆర్ ఈ వాల్ /రిటైనింగ్ వాల్ డిజైన్ యొక్క ప్రూఫ్ చెకింగ్; BOQ తయారీ; సవివర అంచనా తయారీ; తుది స్థల సర్వే నిర్వహించుట; భూసేకరణ ప్రతిపాదనలు తయారీ; సంబంధిత కోడ్స్ /మాన్యువల్స్ ప్రకారం సాంకేతిక స్పెసిఫికేషన్లతో భూ సాంకేతిక పరిశోధన నిర్వహించుట మరియు బిడ్ డాక్యుమెంట్ తయారీ. సుమారు టెండరు విలువ: రూ. 1,22,86,260/-, బయానా: రూ. 2,11,400/-, నెలలలో పూర్తిచేయు కాలం: 90 రోజులు, నెలలలో నిర్వహణ కాలం: 06 నెలలు.

1.టెండరుదారు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు. 2. ... 3. ... 4. ...

A0770 డిప్యూటీ చీఫ్ ఇంజనీర్/ గతిశక్తి/ సికింద్రాబాద్

టెండరు వివరాలు కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in ను దర్శించండి.


## తిరుమల ఘాట్ రోడ్డులో బస్సు బోల్తా

తిరుమల: ప్రజాపాలన ప్రతినిధి: తిరుమల నుంచి తిరుపతికి భక్తులతో వెళ్తున్న ఎలక్ట్రిక్ బస్సు బుధవారం మధ్యాహ్నం బోల్తా పడింది. తిరుమల నుంచి వస్తుండగా.. మొదటి ఘాట్‌రోడ్డులోని 29, 30 మలుపు వద్దకు రాగానే డివైడర్‌ను ఢీకొన్న బస్సు లోయలోకి దూసుకెళ్లింది..ప్రమాద సమయంలో బస్సులో 45 మంది భక్తులు ప్రయాణిస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో విధులు ముగించుకొని అదే మార్గంలో వెళ్తున్న ఎస్పీఎఫ్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే ప్రమాదానికి గురైన బస్సు అద్దాలను ధ్వంసం చేసి భక్తులను కాపాడారు. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, పలువురు భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాద ఘటనపై ఈవో ధర్మారెడ్డి విచారణకు ఆదేశించారు. ఆర్టీసీ ఎండీతో పాటు ఎలక్ట్రిక్ బస్సులు సరఫరా చేస్తున్న ఒలేక్ట్రా కంపెనీ ప్రతినిధులతోనూ ఈవో మాట్లాడారు.

## ప్రమాదవశాత్తు కాలవలో పడి మృతి చెందిన పాపకి. అంత్యక్రియల నిమిత్తం దీవెన ఫౌండేషన్ ఆర్థిక సహాయం

ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ పశ్చిమ విజయవాడ: జక్కంపూడి వైఎస్సార్ కాలనీకు చెందిన నాలుగు సంవత్సరముల పాప నయోమిప్రమాదవశాత్తు కాలవలో పడి మృతి చెందడం జరిగింది తండ్రి లేడు తల్లి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ ఉన్నది పాప అనుకోని పరిస్థితుల వల్ల పాప మృతి చెందటంతో అంత్యక్రియల నిమిత్తం దీవెన ఫౌండేషన్ వారిని ఆశ్రయించడం జరిగింది.

# 28న కళాభారతిలో సురభి వారిచే ఘంటసాల నాటకం రెండు ప్రదర్శనలు




ప్రజాపాలన ప్రతినిధి: భారతదేశ నాటక రంగ చరిత్రలో మొట్టమొదటి నాటక గ్రంథాలయం కు శాశ్వత నిధుల కోసం రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో ఘంటసాల జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు బాదంగీర్ సాయి తెలిపారు. బుధవారం విశాఖ డాబా గార్డెన్స్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీ భాస్కరుని సత్య జగదీష్ దర్శకత్వంలో ఈనెల 28న ఆదివారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శిస్తున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు అలాగే రాత్రి 7:30 గంటలకు వరుసగా రెండు ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ ప్రదర్శనకు రూ. 300 లు, రూ. 200లు, రూ. 100 ల డోనర్ పాసులు అందుబాటులో కళాభారతి లోనూ, రంగసాయి నాటక గ్రంథాలయం నందు మరియు సాయి బాదంగీర్ సెంటర్ వద్ద 26వ తేదీ నుండి అందుబాటులో ఉంటాయని తెలిపారు. మిగతా వివరాలు కొరకు 9440458458 కి ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు. సీనియర్ పాత్రికేయులు ఎన్. నాగేశ్వరరావు (ఎన్. ఎన్. ఆర్) మాట్లాడుతూ శ్రీ భాస్కరుని సత్య జగదీష్ రచన, దర్శకత్వంలో శ్రీ సాయి సంతోషి నాట్యం మండలి సురభి వారిచే ప్రదర్శిస్తున్న తొలి సాంఘిక నాటకమని పేర్కొన్నారు. 138 సంవత్సరాల చరిత్ర గల సురభి వారిచే ఘంటసాల జీవిత చరిత్ర నాటకం ప్రదర్శించడం గొప్ప విషయం అన్నారు. తప్పకుండా అందరూ కలిసి చూడవలసిన నాటకమని వెల్లడించారు. విశాఖ ప్రజలు ఈ నాటకాన్ని వీక్షించాలని తెలిపారు. సీనియర్ పాత్రికేయులు బి.ఎస్. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒక మంచి నాటకాన్ని విశాఖ ప్రజలకు అందించేందుకు రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకులు బాదంగీర్ సాయి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సినీ నటులు కుమార్ రాజా మాట్లాడుతూ ఒక మంచి ఆశయంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్న బాదంగీర్ సాయికి అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కోఆర్డినేటర్ చినబాబు మాట్లాడుతూ విశాఖ ప్రజలు తప్పకుండా ఈనెల 28న ఈ కార్యక్రమానికి హాజరై ఈ నాటకం చూడాలని కోరారు.

## 'కోడికత్తి' తరహాలో అవినాష్‌రెడ్డి డ్రామా: భాజపా నేత సత్యకుమార్



తిరుపతి: ప్రజాపాలన ప్రతినిధి: నాలుగేళ్లలో సీఎం జగన్ నమ్మకద్రోహంతో నయవంచక పాలన అందించారని భాజపా జాతీయ కార్యదర్శి సత్యకుమార్ విమర్శించారు. రాజధాని అంశంతో పాటు రైతు భరోసా, పంటల బీమా, మద్దతు ధర, బిందు సేద్యం తదితర అంశాల్లో సీఎం మోసం చేశారని ఆరోపించారు..రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆయన విమర్శించారు. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో సత్యకుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి.. దారిదోపిడీకి మించిపోయిందన్నారు. పంచభూతాల్లో ఏ ఒక్కదాన్నీ వదలకుండా వైకాపా నేతలు దోచుకుంటున్నారని ఆరోపించారు. 'కోడికత్తి' తరహాలో ఎంపీ అవినాష్‌రెడ్డి డ్రామా కొనసాగుతోందని ఎద్దేవా చేశారు. "మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో సీబీఐ విచారణకు అవినాష్‌రెడ్డి సహకరించడం లేదు. సీబీఐకి రాష్ట్ర పోలీసులు సహకరించకుండా వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి మంచిదికాదు. అవినాష్ అరెస్ట్ ఖాయం. వైకాపాలో సంస్కారం లేని వ్యక్తులు భాజపాపై విమర్శలు చేస్తున్నారు. యువతకు మెగా డీఎస్సీ అని జగన్ నమ్మకద్రోహం చేశారు. రాష్ట్రంలో రీసర్వే పేరుతో అటవీ, వివాదాస్పద, ప్రభుత్వ భూములను గుర్

## తుళ్లూరు దీక్షా శిబిరం వద్ద ఉద్రిక్తత.. మహిళలు, వృద్ధులను పోలీసులు లాగి పడేశారు!



గుంటూరు: ప్రజాపాలన ప్రతినిధి: గుంటూరు జిల్లా తుళ్లూరులో అధికార, ప్రతిపక్ష పార్టీలు ర్యాలీలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు 144 సెక్షన్ విధించారు. ఆర్–5 జోన్‌కు వ్యతిరేకంగా తుళ్లూరు దీక్షా శిబిరంలో గుంటూరు జిల్లా తెదేపా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్ కుమార్ నిరసన దీక్షకు పిలుపునిచ్చారు..అయినప్పటికీ ఆర్–5 జోన్‌కు వ్యతిరేకంగా తుళ్లూరులో తెదేపా ఆధ్వర్యంలో రైతులు నిరసన దీక్ష చేపట్టారు. అప్పటికే దీక్షా శిబిరం వద్ద పోలీసులు వందల సంఖ్యలో మోహరించారు. ర్యాలీలు, నిరసనలకు అనుమతి లేదంటూ.. రైతులను పోలీసులు అరెస్టు చేశారు. మహిళలు, వృద్ధులు అని కూడా చూడకుండా పోలీసులు వారిని లాగి పడేశారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది, జై భీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్‌నూ పోలీసులు అరెస్టు చేశారు. దీంతో దీక్షా శిబిరం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శాంతియుతంగా దీక్ష చేపడుతుంటే అడ్డంకులేంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అరెస్టు చేసిన రైతులు, మహిళలను బలవంతంగా వాహనాలు ఎక్కించి తుళ్లూరు పీఎస్‌కు తరలించారు..దీక్షా శిబిరంలోకి ఎవరినీ వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. రోజువారీ నిరసనలకు కూడా అనుమతి లేదని పోలీసులు తేల్చి చెబుతున్నారు. ఎవరొచ్చినా సరే బలవంతంగా అరెస్టు చేస్తామని తేల్చి చెబుతున్నారు. మరోవైపు తుళ్లూరు మండలంలో తెదేపా నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు..

# విద్యా దానం గొప్పది



హిందూపురం:ప్రజాపాలన ప్రతినిధి: శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం పట్టణం త్యాగరాజనగర్ లోని మార్గదర్శి విద్యానికేతన్ పాఠశాలలో కె. సాయికళ – కె.మాళప్ప ఆధ్వర్యములో నిర్వహిస్తున్న 25 సం. ఉచిత వేసవి బడి విద్యార్థులకు బుధవారం రైటింగ్ ప్యాడ్లు పంపిణీ జరిగింది. హిందూస్ వ్యాలీ రియల్ ఎస్టేట్ అధినేత యన్. కృపాకర రెడ్డి అందించిన పరీక్ష అట్టలను ఆయనతో పాటు కె.మాళప్ప, సప్తగిరి ఈశ్వర రెడ్డి, యం సి గంగాధర్, యోగా టీచర్ శ్రీనివాస రెడ్డి, హింది టిచర్ అనితా లక్ష్మి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అంతకు ముందు నిర్వాహకులు కె. మాళప్ప అద్యక్షతన జరిగిన సమావేశంలో దాత యన్. కృపాకరరెడ్డి, సప్తగిరి ఈశ్వరరెడ్డి ప్రసంగిస్తూ 25 సం.రాలుగా కె. సాయికళ –కె. మాళప్ప దంపతులు పేద విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. వేసవి సెలవుల్లో కంప్యూటర్, కరాటే, యోగ, నృత్యాలు, సంగీతం, చిత్రలేఖనం తదితర శిక్షణనిస్తున్న ఉపాధ్యాయుల సేవలు సద్వినియోగం చేసుకోవలన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత పౌరులుగా ఎదిగి దేశానికి సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి యస్. కుమారి, మమత విద్యార్థులు తదితరలు పాల్గొన్నారు.

# సంతోష్ కుటుంబాన్ని ఓదార్చిన మంత్రి "ధర్మాన"



శ్రీకాకుళం ప్రజాపాలన ప్రతినిధి: :శ్రీకాకుళం జిల్లా, గార మండలం, ఆరంగిపేట గ్రామం లో నివాసముంటున్న మల్ల సంతోష్ ఇటీవలే తమిళనాడు తిరుచినాపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాద రావు ఈ రోజు గార గ్రామానికి వెళ్లి సంతోష్ అన్నయ్య విశ్వనాథ్, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం మాట్లాడుతూ చిన్న వయసులోనే సంతో చనిపోవటం బాధాకరమని అన్నారు. సంతోష్ పని చేసిన సంస్థ ప్రతినిధులతో మాట్లాడి సమాచారాన్ని తెలుసుకొని కుటుంబానికి అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో గార సర్పంచ్ మార్పు పృధ్వి, ఉప సర్పంచ్ ఆరంగి రాంబాబు, ఆరంగి అప్పలనాయుడు, ముంజేటి కృష్ణమూర్తి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## "ఛలో రాజమహేంద్రవరం" బారీ మహానాడుకు అందరికీ ఇదే మా ఆహ్వానం..రాజు సోలంకి



ఎన్టీఆర్ జిల్లా ప్రజాపాలన ప్రతినిధి: విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ..తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు.రాజు సోలంకి మహానాడుకు ఆహ్వానం .. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు భారతదేశం గర్వించదగ్గ మహానీయుడు పేదవాడికి కూడు గూడు గుడ్డ కల్పించినటువంటి మహానేత తెలుగువారి ఆత్మగౌరం చాటి చెప్పిన తెలుగుదేశం పార్టీ స్థాపించి ఆంధ్ర రాష్ట్ర ప్రజలతో అన్న అని పిలిపించుకున్న ఏకైక రాజకీయ నాయకుడు మహానేత,యుగపురుషుడు కీర్తిశేషులు అన్న నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా మహానాడు కార్యక్రమానికి స్వాగతం సుస్వాగతం..టిడిపి పార్టీ నేతలకు తెలుగు తమ్ముళ్లకు ఓ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేస్తున్నాం. ఇది ప్రతి టిడిపి కార్యకర్త నాయకులకు మన బాధ్యతగా పార్టీ అధికారంలో తీసుకొచ్చే చంద్రన్న సీఎం చేయాలన్నదే మన లక్ష్యం. తెలుగుదేశం పార్టీ కుటుంబం సభ్యులందరికీ విన్నపం 27-05-2023 నుంచి 28-05-2023 వరకు "ఛలో రాజమహేంద్రవరం" బారీ మహానాడు కార్యక్రమమునకు ఆంధ్రప్రదేశ్లో రాష్ట్రంలో ఉన్న ఎంపీలు. మాజీ ఎంపీలు. మాజీ మంత్రులు. ఎమ్మెల్యేలు.. మాజీ ఎమ్మెల్యేలు. ఎమ్మెల్సీలు. మాజీ ఎమ్మెల్సీలు. జిల్లాల అధ్యక్షులు.. ఇన్చార్జులు.. కార్పొరేటర్లు .మాజీ కార్పొరేటర్లు ..డివిజన్ అధ్యక్షులు. మరియు ముఖ్యంగా.. ప్రతి మండలం నుంచి. ప్రతి పంచాయతీ నుంచి. గ్రామంలో నుంచి. తెలుగుదేశం పార్టీ అభిమాన సీనియర్ నాయకులు. కార్యకర్తలు. మహిళా మణులు. తెలుగు యువత కార్యకర్తలు. భారీ స్థాయిలో రాజమండ్రిలో జరిగే ఈ మహానాడు కార్యక్రమానికి భారీగా తరలివస్తారని ఈ కార్యక్రమాన్ని ఎంతో విజయవంతం చేస్తారని కోరుకుంటున్నాం తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం జిల్లాఅధ్యక్షులు.రాజు సోలంకి విజయవాడ.

## కిడ్నీ వ్యాధి గ్రస్తునికి అండగా "మదర్స్ లవ్ ఫౌండేషన్"



ఇచ్ఛాపురం ప్రజాపాలన ప్రతినిధి: :శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురానికి చెందిన బచ్చల. సింహాద్రి గత కొంత కాలంగా దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. సింహాద్రి కుటుంబ పోషణ అంతంత మాత్రమే కావటంతో మందులను కొనటానికి కూడా ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న మదర్స్ లవ్ ఫౌండేషన్ ప్రతి నెలా మందులను ఉచితంగా ఇవ్వటానికి ముందుకు వచ్చింది. ఈ మందులను విశాఖపట్టణానికి చెందిన జి. ఉమా మహేశ్వర రావు అందిస్తారని ఫౌండేషన్ సభ్యులు ఐ.వి.ఎస్ హర్ష తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం జి. ఉమా మహేశ్వర రావు, సింహాద్రికి మందులను అందజేసి మాట్లాడుతూ మదర్స్ లవ్ ఫౌండేషన్ ద్వారా మందులను అందించటం ఆనందంగా ఉందని, ఫౌండేషన్ చేస్తున్న సేవలను కొనియాడుతూ, ప్రపంచవ్యాప్తంగా సుమారు 10% మంది దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి (సికెడి) బారిన పడుతున్నారని, మూత్రపిండాలు శరీరం నుండి వ్యర్థ ఉత్పత్తులను తొలగించడంలో విఫలం కావడం వల్ల ఇది జరుగుతుందని, . రక్తంలో మలినాలు తొలిగించటానికి సహాయపడే మూత్రపిండాలకు అనుకూలమైన ఆహారాన్ని తీసుకోవటం ముఖ్యమన్నారు. అనంతరం నిర్విరామ సేవలు చేస్తున్న మదర్స్ లవ్ ఫౌండేషన్ ని అభినందిస్తూ ఏ అవసరమున్న నన్ను సంప్రదించవచ్చని అన్నారు. ఈ కార్యనిర్వాహణలో మదర్స్ లవ్ ఫౌండర్ ఐ.వి.ఆర్ హర్ష, ప్రెసిడెంట్ బి. సుప్రజ రౌత్, సభ్యులు తిప్పన. దుర్యోధన, నిదీష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆదిపురుష్ ప్రీ రిలీజ్ ఈవెంట్ డేట్ ఫిక్స్..!



శ్రీరామ చంద్రుడిగా పాన్ ఇండియా రెబల్ స్టార్ నటించిన తాజా చిత్రం ఆది పురుష్. అయితే ఈ సినిమాలో సీతా దేవిగా కృతి సనన్ కనిపించబోతున్నారు. లక్ష్మణుడి పాత్రను సన్నీ సింగ్ హనుమంతుని పాత్రలో దేవదత్తా నాగే నటించారు. లంకేశుడి పాత్రలో బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్ కనిపించనున్నారు. అయితే ఈ సినిమాను జూన్ 16వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా త్రీడీలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమాకు సంబంధించిన ఓ అదిరిపోయే అప్ డేట్ వెలుగులోకి వచ్చింది. అదేంటంటే.. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ ను తెలుగు గడ్డపై నిర్వహించేందుకు చిత్రబృందం ఏర్పాట్లు చేస్తోంది. ఆధ్యాత్మిక క్షేత్రమైన హిందువులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల శ్రీనివాసుడి కొలువైన తిరుపతిలో ఆది పురుష్ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ ను నిర్వహించబోతున్నట్లు చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన యువీ క్రియేషన్స్ తెలిపింది. అయితే జూన్ 6వ తేదీ సాయంత్రం భారీ ఎత్తున భక్తులు ప్రేక్షకులు అభిమానుల సమక్షంలో ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ప్రభాస్ ను పాన్ ఇండియా స్టార్ గా మార్చిన బాహుబలి సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు కూడా తిరుపతిలోనే జరిగిందట. మరోసారి ప్రభాస్ చిత్రానికి ఇక్కడే ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహిస్తే బ్లాక్ బస్టర్ హిట్టుగా నిలుస్తుందని ఆయన అభిమానులు అనుకుంటున్నారు. ప్రభాస్ శ్రీరామ చంద్రుడిగా కనిపించిన ఈ సినిమాకు అజయ్ – అతుల్ సంగీతం అందించారు. అలాగే రామజోగయ్య శాస్త్రి పాటలు రాశారు. టీ సిరీస్ అధినేత భూషణ్ కుమార్ అండ్ కృష్ణన్ కుమార్ దర్శకుడు ఓం రౌత్ ప్రసాద్ సుతార్ రెట్రోఫిల్స్ రాజేష్ నాయర్ తో కలిసి ప్రభాస్ హోమ్ బ్యానర్ లాంటి యూవీ క్రియేషన్స్ ఈ సినిమాను విడుదల చేస్తోంది. త్రీడీ ఐమాక్స్ ఫార్మాట్స్ లో ఈ చిత్రం విడుదల కాబోతుంది. తెలుగుతో పాటు హిందీ తమిళ కన్నడ మలయాళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. అయితే ఇప్పటి వరకు విడుదలైన సినిమా పోస్టర్లు పస్ట్ లుక్ గ్లింప్స్ వీడియో ట్రైలర్లు అందిరలోనూ ఆసక్తిని పెంచాయి. ముఖ్యంగా రామాయణ ఇతిహాసం కాబట్టి దేశ వ్యాప్తంగా ప్రజలంతా ఈ సినిమా చూసేందుకు వస్తారని చిత్రబృందం భావిస్తుంది. చూడాలి మరి ఈ సినిమా ఏ రేంజ్ లో ప్రేక్షకులను అలరిస్తుందో.

# "గేమ్ ఛేంజర్" షూట్ పై లేటెస్ట్ అప్డేట్.!




ప్రస్తుతం గ్లోబల్ మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా కియారా అద్వానీ హీరోయిన్ గా మావెరిక్ దర్శకుడు శంకర్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా సినిమా "గేమ్ ఛేంజర్" కోసం అందరికీ తెలిసిందే. మరి ఒక ప్లానింగ్ ప్రకారం అయితే దర్శకుడు శంకర్ సినిమా షూట్ చేస్తుండగా ఇప్పుడు ఇండియన్ 2 లో తాను బిజీగా ఉండనున్నారు. ఇక ఇప్పుడు చరణ్ సినిమాపై అయితే అప్డేట్ తెలుస్తుంది. మేకర్స్ ఈ సినిమా షూట్ ను ఈ జూన్ మొదటి వారం నుంచి స్టార్ట్ చేసి దాదాపు 10 రోజుల్లోపు షెడ్యూల్ లా ముగించనున్నారట. ఇక ఈ షెడ్యూల్ లో అయితే చరణ్ సహా వెర్సటైల్ నటుడు సముద్రఖని పై కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నారట. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా నిర్మాత దిల్ రాజు తమ బ్యానర్ లో 50వ సినిమాగా అయితే బడ్జెట్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాని నిర్మాణం వహిస్తున్నారు

# పవన్ను స్టార్ను చేసిన మూవీ రీ రిలీజ్




టాలీవుడ్లో స్టార్ హీరోల సినిమాల రీ రిలీజ్లు కంటిన్యూ అవుతున్నాయి. ఇప్పటికే పవన్ కల్యాణ్ మహేశ్ బాబు ప్రభాస్ జూనియర్ ఎన్టీఆర్ రామ్ చరణ్ నందమూరి బాలకృష్ణలు నటించిన ఎన్నో సినిమాలు మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. వీటికి ఫ్యాన్స్ నుంచి భారీ స్థాయిలో రెస్పాన్స్ రావడంతో రీ రిలీజ్లోనూ ఇవన్నీ రికార్డులు క్రియేట్ చేసిన విషయం తెలిసిందే. రీ రిలీజ్ల ట్రెండ్ మొదలైన తర్వాత పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన 'ఖుషి' 'జల్సా' వంటి చిత్రాలు మరోసారి వెండితెరపై ఓ రేంజ్లో సందడి చేశాయి. వీటికి భారీ స్థాయిలో స్పందన దక్కింది. ముఖ్యంగా 'ఖుషి' మూవీ అత్యధిక కలెక్షన్లతో రికార్డులు క్రియేట్ చేసింది. ఇలా ఇప్పటికీ ఈ సినిమానే ఎక్కువ వసూళ్లను సాధించిన రీ రిలీజ్ మూవీగా కొనసాగుతోంది. ఇప్పటికే పలు చిత్రాలను రీ రిలీజ్ చేసిన పవన్ కల్యాణ్ అభిమానులు.. ఇప్పుడు అతడిని స్టార్గా మార్చేసిన 'తొలిప్రేమ' మూవీని కూడా మరోసారి తీసుకు రాబోతున్నారు. ఈ సినిమా విడుదలై 25 సంవత్సరాలు పూర్తవబోతున్న నేపథ్యంలో జూన్ 30వ తేదీని రీ రిలీజ్ చేయబోతున్నారు. తాజాగా దీనికి సంబంధించిన ప్రకటనను అధికారికంగా వదిలారు. పవన్ కల్యాణ్ నటించిన 'తొలిప్రేమ' మూవీని జూన్ 30వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గ్రాండ్గా విడుదల చేయబోతున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఈ సినిమా 4కె ప్రింట్ వర్క్ జరుగుతోంది. ఇది పూర్తైన వెంటనే ట్రైలర్ను రిలీజ్ చేయనున్నట్లు తెలిసింది. ఇక పవన్ను స్టార్గా మార్చిన ఈ సినిమా విడుదలను పండుగలా జరుపుకోవాలని ఫ్యాన్స్ ఏర్పాట్లను చేస్తోన్నారు.

ఇదిలా ఉండగా.. పవన్ కల్యాణ్ హీరోగా నటించిన 'తొలిప్రేమ' సినిమా 1998లో రిలీజ్ అయింది. కరుణాకరణ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. తెలుగు అమ్మాయి కీర్తి రెడ్డి హీరోయిన్గా నటించిన ఈ చిత్రానికి దేవా సంగీతాన్ని అందించారు. వాసుకి అలీ వేణు మాధవ్ రవి బాబు వంటి వాళ్లు కీలక పాత్రలు చేశారు. అప్పట్లో ఈ చిత్రం లవ్ స్టోరీ మూవీలకు ట్రెండ్ సెట్టర్గా నిలిచిన విషయం తెలిసిందే.

## అదరగొట్టిన

# 'టైగర్ నాగేశ్వరరావు' ఫస్ట్ లుక్




మాస్ మహారాజా రవితేజ హీరోగా యువదర్శకుడు వంశీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియన్ మూవీ టైగర్ నాగేశ్వరరావు. నుపుర్ సనన్, గాయత్రి భరద్వాజ్ హీరోయిన్స్ గా నటిస్తున్న ఈ మూవీని అభిషేక్ పిక్చర్స్ బ్యానర్ పై అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తుండగా జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఈ భారీ ప్రతిష్టాత్మక మూవీ యొక్క ఫస్ట్ లుక్ ని కొద్దిసేపటి క్రితం రాజమండ్రి హావ్ లాక్ బ్రిడ్జి మీద గ్రాండ్ గా విడుదల చేయగా తెలుగు సహా పలు ఇతర భాషల్లో పలువురు స్టార్ హీరోలు దీనిని డిజిటల్ గా రిలీజ్ చేయడం జరిగింది. ఇక తెలుగులో ఫస్ట్ లుక్ ని విక్టరీ వెంకటేష్ విడుదల చేయడంతో పాటు ఈ ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్ లో విక్టరీ వెంకటేష్ వాయిస్ అదిరిపోయింది. 1970 ల కాలం నాటి టైగర్ జోన్ గా పేరుగాంచిన స్టువర్ట్ పురం గజదొంగ టైగర్ నాగేశ్వరరావు ఫస్ట్ లుక్ ఎంతో బాగుంది. కాగా ఈ పవర్ఫుల్ లుక్ ప్రస్తుతం అందరినీ ఆకట్టుకుంటోంది. కాగా ఈ మూవీని అక్టోబర్ 20న పలు భాషల్లో గ్రాండ్ గా విడుదల కానుంది.

# ధనుష్ కి సోదరుడిగా నటించనున్న టాలీవుడ్ యంగ్ హీరో?



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ తన 50వ చిత్రానికి దర్శకత్వం వహించనున్న సంగతి అందరికీ తెలిసిందే. దీనికి తాత్కాలికంగా %ణ%50 అని పేరు పెట్టారు. విష్ణు విశాల్ ఇందులో కథానాయకుడిగా నటిస్తారని అంతా భావిస్తున్నారు. ఈ చిత్రంలో ధనుష్ సోదరుడిగా టాలీవుడ్ హీరో సందీప్ కిషన్ ఎంపికైనట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో విలక్షణ నటుడు ఎస్జే సూర్య కూడా కీలక పాత్రలో కనిపించనున్నాడని సమాచారం. టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ ఇప్పటికే ధనుష్ తదుపరి ప్రాజెక్ట్ కెప్టెన్ మిల్లర్లో కీలక పాత్రలో నటిస్తున్నారు. గ్యాంగ్స్టర్ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో కాళిదాస్ మరియు దుషార విజయన్ లు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సన్ పిక్చర్స్ ఈ ప్రాజెక్టను భారీ స్థాయిలో నిర్మిస్తోంది.

# పుష్ప 2లో మరో క్రేజీ స్టార్?




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం పుష్ప2. పుష్పకి సీక్వెన్స్ గా ఈ సినిమా తెరకెక్కిస్తున్నారు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ని త్వరగా ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తోంది. పుష్ప మూవీకి మించేలా ఈ సినిమా ఉంటుందనే ప్రచారం ఇప్పటికే జరుగుతోంది. ఇటీవల విడుదల చేసిన గింప్ల్స్ అల్లు అర్జున్ లుక్ కూడా చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. ఈ సినిమా లో అల్లు అర్జున్ సరసన రష్మిక మందనా నటిస్తోంది. . ఫహద్ ఫాజిల్ మరో కీలక పాత్ర పోషిస్తున్నారు. కాగా ఈ మూవీ గురించి తాజాగా ఓ క్రేజ్ న్యూస్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇంతకీ ఆ వార్త ఏంటో తెలుసా? ఓ బాలీవుడ్ హీరో కూడా ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పుష్ప 2 లో ఓ అతిధి పాత్ర ఉందిని ఈ పాత్రలో హిందీ స్టార్ రణవీర్ సింగ్ కనిపించనున్నారని తెలుస్తోంది. ఈ పాత్ర సినిమాలో కీలకసమయంలో ఎంట్రీ ఇస్తుందని అంటున్నారు. బన్నీ పాత్రను పరిచయం చేస్తూ వచ్చే ఓ పోలీస్ ఆఫీసర్ పాత్రలో రణవీర్ సింగ్ నటిస్తున్నాడని ప్రచారం జరుగుతోంది. ఆయన పాత్ర సినిమాలో చాలా ఇంట్రస్టింగ్ గా ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. నార్త్ జనాలను ఇప్పటికే పుష్ప మొదటి భాగం ఆకట్టుకుంది. రెండో భాగం కూడా ఆకట్టుకోవాలంటే అక్కడి నటులు ఎవరైనా ఉంటుందని ఆలోచించారట. అందుకే రణవీర్ ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. రణవీర్ ఓ సిన్సియర్ పోలీసు అధికారిగా కనిపిస్తారని తెలుస్తోంది. ఈ విషయంపై ఇప్పటి వరకు అధికార ప్రకటన అయితే వెలువడలేదు. ఇదిలా ఉండగా పుష్ప2 తర్వాత పుష్ప3 కూడా వస్తుందని మరో ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు త్రీక్వెల్ స్క్రిప్ట్ను సుకుమార్ ఫ్రాంచైజీగా చేయాలనే ఉద్దేశ్యంతో పుష్పకు సిద్ధం చేసినట్లు ఆన్లైన్లో గాసిప్ చక్కర్లు కొడుతోంది. పుష్ప 3: ది రూల్ బిగిన్స్ అనే పేరు పెట్టారు అంటూ ప్రచారం జరుగుతోంది. నటుడు ఫహద్ ఫాసిల్ కూడా పుష్ప 3 ఉంటుందని గతంలో చెప్పడం గుర్తుండే ఉంటుంది.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com